నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
సోమవారం సెప్టెంబర్ 23, 2024

స్మశాన వాటిక కూల్చిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ కాశిబుగ్గ

దళితుల స్మశాన వాటికను కూల్చిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. నగరంలోని పెద్దమ్మ గడ్డ ప్రాంతంలో దళితుల స్మశాన వాటికలో కూల్చిన గోరీలను ఆదివారం సిపిఎం నార్త్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ హనుమకొండ నగరంలో రోజురోజుకు భూకబ్జా దారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని అన్నారు. 1971 నల్లెల కట్టయ్య తనకు చెందిన నాలుగు ఎకరాల భూమిని స్మశాన వాటిక కోసం రాసిచ్చాడని, అప్పటినుండి దళితులు ఎవరు మరణించిన అందులోనే సమాధులు కడుతున్నారని అన్నారు. ఆ భూమిపై కన్నుపడ్డ కిషన్‌రాజ్, ప్రభాకర్, జ్యోతి, తదితరులు కలిసి దొంగ పత్రాలు సృష్టించి ఈభూమి తమదని కోర్టులో కేసు వేసి ఇప్పుడు దళితుల సమాధులను, చుట్టు కాంపౌండ్ వాల్‌ను బుల్డోజం తో నేలమట్టం చేయడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. తక్షణమే వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మించి, ఆ భూమిని రక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నార్త్ మండల కమిటీ కార్యదర్శి గాదే రమేష్, మండల నాయకులు మంద మల్లేశం, బోట్ల కుమారస్వామి స్వయంకృషి మహిళా సంఘం నాయకులు తీగల శోభ, భాగ్యమ్మ, రాధ, సుచరిత, అనిత సిపిఎం నాయకులు స్వప్న, తార, నవీన్, రవి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలే కమ్యూనిస్టుల ప్రధాన ఏజెండా

సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారం బాబు

నవతెలంగాణ-వరంగల్

రామన్నపేట రఘునాథ్ కాలనీ సీపీఐ (ఎం) శాఖా మహాసభలు నిర్వహించారు. ఆదివారం లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన మహాసభలకు అధ్యక్ష వర్గంగా కొల్లోజు రమేష్, కందుకూరు రమేష్, దామెర శ్రీనివాస్ లు. వ్యవహరించగా ముఖ్య అతిథిగా సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు బాబు, జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్‌లు హాజరయ్యారు కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడాతూ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ అనేక త్యాగాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. అట్లాం టి పార్టీలో పనిచేయడం గర్వకారణం అని అన్నారు. సీపీఐ (ఎం) నాయకుల కు ఎంతో కొంత దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. అందుకు నిదర్శనం" పుచ్చలపల్లి సుందరయ్య నుండి సీతారాం ఏచూరి లాంటి వారిని ఎంతోమందిని దేశానికి అందించిన చరిత్ర సీపీఐ(ఎం) అట్లాంటి త్యాగాలు చరిత్ర కలిగిన పార్టీలో నేటితరం యువతను ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు రఘునాథ్ కాలనీ సీపీఐ (ఎం) పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ సీతారామ ఏచూరి, అమరవీరుల చిత్రపటాలకు వేసి నివాళులర్పిం చారు,ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కొల్లోజు రమేష్, దామెర శ్రీనివాసు, కందుకూరి రమేష్, బోయపల్లి గాలయ్య పులిమాటి శివ, దుప్పటి బాబు, చరమంద చారి, కుమార్, సంపత్, ఇనుముల కిరణ్, రవి, ఎలిషా, సంపత్ పాల్గొన్నారు.



రైతుల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలి

నవతెలంగాణ-నర్సంపేట

రైతుల రుణ మాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొరబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ (ఎం) కార్యాలయంలో మండల కమిటీ సభ్యులను బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి హామీ ఇచ్చిన ప్రకారం దాదాపు 42లక్షల మందికి పూర్తి స్థాయిలో అప్పు మాఫీ కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు వరకు సగం మంది రైతులకు మాత్రమె రుణమాఫీ అమలు అయిందన్నారు. రూ.2లక్షలకు పైగా బ్యాంకుల్లో అప్పు ఉన్న రైతులకు ఈ రోజు వరకు అప్పు మాఫీ కాలేదు అన్నారు. పైన పేర్కొన్న రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 15రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా సమ్మయ్య మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు భరోసాను ఈ రోజు వరకు ఎన్నికల ముందు రైతు భరోసాను ఎకరాకు రూ.15వేల ఆదుకుంటామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో రూ. 2లక్షల రుణ మాఫీ, రైతు బరోసా అమలు చేయాలని లేనిచో రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు . ఈ సమావేశం లో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కత్తి పెద్ద కట్టయ్య బీ.మలహాళ్ రావు, కట్కూరి శ్రీనివాస రెడ్డి, పెండ్యాల సారయ్య, భోసిక మొగిలి, అన్వర్, రుద్రరపు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఫాతిమానగర్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు

చేసిన కేంద్ర మంత్రి శ్రీ జార్జ్ కురియన్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ సంస్థాగత పర్యటనలో భాగంగా హనుమకొండ జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, ఫిషరీస్, మరియు మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి జార్జ్ కురియన్ ఆదివారం ఉదయం కాజీపేట ఫాతిమా నగర్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భారతీయ రోమన్ కాథలిక్ పీఠాధిపతి, వరంగల్ బిషప్ డా. ఉడుముల బాల గారు, చర్చ్ ఫాదర్ కాసు మార్రెడ్డి, కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ గారిని శాలువతో సత్కరించారు. చర్చ్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దయాసాగర్, సెక్రటరీ టామీ కౌన్సిల్ సభ్యులు కేంద్ర మంత్రి జార్జ్ కురియన్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.కేంద్ర మంత్రి వెంట బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా నాయకులు డి.అమర్నాథ్‌రెడ్డి, సత్యనారయణ, తోపుచేర్ల మధుసుధన్‌రావు, గాదె రాంబాబు, నరేందర్, బండి భాస్కర్, బత్తుల వినయ్, జన్ను మధు, చర్చ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజా సేవకు అనేక మార్గాలు

- ఎస్ఆర్ఆర్ సంస్థ అధినేత శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-రాయపర్తి

ప్రజాసేవ చేయడానికి రాజకీయమే మార్గం కాదని ఇంకా అనేక మార్గాలు ఉన్నాయని ఎస్ఆర్ఆర్ సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు, కాట్రపల్లి గ్రామాల్లో నిర్వ హించ నున్న దుర్గామాత ఉత్సవాలకు 21వేయి రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సౌజన్యకు ఆరు వేల రూపాయలు అందచేసి భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అతి పెద్ద పండుగ అయిన దసరాను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న దుర్గామాతలను భక్తిశ్రద్ధలతో పూజించి నవరాత్రులను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. వర్తమాన కాలంలో ఫౌండేషన్ కార్యకలాపాలు విస్తతమైన వేళ సామాజిక మాధ్యమాల్లో గందరగోళ మెసేజ్ లు ప్రచారం కావడం బాధాకరం అన్నారు. ప్రజలకు సేవ చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయని రాజకీయాల ద్వారా మరింత సేవ చేయగలుగుతానని భావించినప్పుడు తప్పకుండా రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. మండల ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ యుపి హెచ్ఐ వల్లాల సుధాకర్, పతంగి వేణు, కేశవరెడ్డి, కాట్రపల్లి విక్టరీ యూత్ అధ్యక్షుడు గిర్క సురేష్, బిక్షపతి, మధు అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రామప్పను సందర్శించిన కేంద్ర సహాయ మంత్రి

నవతెలంగాణ-ములుగు (వెంకటాపూర్)

పాలంపేటలోని ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియాన్ ఆదివారం సందర్శించారు. ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరికొండ బలరాం స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మంత్రికి ప్రత్యేక దర్శనం చేయించారు. ఆలయ పూజారులు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ గైడ్ విజయ్ ఆలయ ప్రతిష్ట గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్ , మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్ రావు , మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మ రావు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, భూపాలపల్లి జిల్లా నిషేధర్‌రెడ్డి, బిజెపి ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం, నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.



గణనీయంగా తగ్గిన వానాకాలం సాగు

తగ్గిన వరి, పత్తి పంటలు

పెరిగిన మొక్కజొన్న, పప్పు ధాన్యాలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానాకాలం సాగు గణనీయంగా తగ్గింది. వరంగల్ జిల్లాలో గత ఏడాదితో పోల్చితే 21,473 ఎకరాలు సాగు తగ్గగా, హన్మకొండ జిల్లాలో 2,681 ఎకరాల సాగు తగ్గింది. వరంగల్ జిల్లాలో వరి, పత్తి సాగు గణనీయంగా తగ్గింది. మొక్కజొన్న, వేరుశనగ, పప్పు ధాన్యాల సాగు పెరిగింది. ఉద్యాన పంటలు 4,200 ఎకరాల మేరకు తగ్గడం గమనార్హం. వరంగల్ జిల్లాలో గత ఏడాది వానాకాలంలో అన్ని పంటలు కలిపి 3,13,575 ఎకరాలు సాగు చేస్తే, ఈసారి వానాకాలంలో 2,92,102 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. హన్మకొండ జిల్లాలో గత ఏడాది వానాకాలంలో 2,33,397 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి అన్ని పంటలు కలిపి 2,30,716 ఎకరాల్లో సాగు చేశారు. హన్మకొండ జిల్లాలో వరి 57 ఎకరాల మేరకు పెరగగా, పత్తి 4,941 ఎకరాలు తగ్గింది. కందులు, మొక్కజొన్న సాగు పెరిగింది. వాతావారణ శాఖ తొలుత వర్షాలు ముందుగానే పడుతాయని ప్రకటించినా, అందుకు విరుద్ధంగా వర్షాలు ఆల స్యంగా పడడంతో పంటలు గణనీయంగా పడ్డాయి. కొన్ని జిల్లాల్లో వర్షాలు సకాలంలో పడ్డా వర్ష పాతాలు నమోదు కాకపోవడం సాగును దెబ్బతీసింది. దీంతో వర్షాధారంగా ఏయే ప్రాంతాల్లో పండిస్తారో ఆయా ప్రాంతాల్లో సాగు గణనీయంగా తగ్గింది. బావుల కింద మాత్రమే సాగు జరుగుతుండడం గమనార్హం.



గణనీయంగా తగ్గిన వరి, పత్తి

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 6 జిల్లాల్లో వానాకాలం సాగు గణనీయంగా తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వరి, పత్తి సాగు పెద్ద ఎత్తున తగ్గాయి. వరంగల్ జిల్లాలో వరి సాగు 5,057 ఎకరాలు తగ్గింది. గత ఏడాది వానాకాలం 1,34,931 ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1,29,974 ఎకరాలు వరి సాగయ్యింది. పత్తి గత ఏడాది 1,22,358 ఎకరాలు సాగు కాగా, ఈ ఏడాది 1,19,778 ఎకరాలు సాగయ్యింది. 2,580 ఎకరాల్లో పత్తి సాగు తగ్గింది. హన్మకొండ జిల్లాలో వరిసాగు గత ఏడాది 1,45,943 ఎకరాలు సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 1,46,000 ఎకరాల సాగు జరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ వానాకాలంలో గత ఏడాది కంటే 57 ఎకరాల సాగు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. పత్తి గత ఏడాది 82,277 ఎకరాల్లో సాగు జరగ్గా, ఈ ఏడాది ఇప్పటి వరకు 77,336 ఎకరాల్లో మాత్రమే పత్తి సాగయ్యింది. అంటే 4,941 ఎకరాల మేరకు పత్తి సాగు తగ్గింది.

పెరిగిన మొక్కజొన్న, పప్పుధాన్యాల సాగు

వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఈ వానాకాలంలో మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోల్చితే పప్పు ధాన్యాల సాగు కూడా పెరిగింది. వరంగల్ జిల్లాలో గత వానాకాలంలో మొక్క జొన్న 4,696 ఎకరాలు సాగు కాగా, ఈ ఏడాది 7,575 ఎకరాల మేరకు సాగయ్యింది. 2,879 ఎకరాల సాగు పెరిగింది. హన్మకొండ జిల్లాలో మొక్కజొన్న సాగు గత ఏడాది 4,187 ఎకరాలు సాగయ్యింది. ఈ ఏడాది 6,272 ఎకరాలు సాగు చేశారు. జిల్లాలో 2,085 ఎకరాల మేరకు మొక్కజొన్న సాగు ఈసారి పెరిగింది. పప్పుధాన్యాల సాగుకు సంబంధించి వరంగల్ జిల్లాలో గత ఏడాది 984 ఎకరాలు సాగు కాగా, ఈ ఏడాది 957 ఎకరాల మేరకు సాగు చేశారు. 90 ఎకరాలు ఈసారి పప్పు ధాన్యాల ఆనగు పెరిగింది. హన్మకొండ జిల్లాలో గత ఏడాది కందులు 542 ఎకరాలు సాగు కాగా, ఈ ఏడాది 682 ఎకరాలు సాగయ్యింది. 140 ఎకరాల సాగు ఈసారి పెరిగింది. పెసర్లు గత ఏడాది 54 ఎకరాలు సాగు చేయగా, ఈ ఏడాది 253 ఎకరాల మేరకు సాగు చేశారు. ఈసారి 199 ఎకరాల మేరకు పెసర్ల సాగు పెరిగింది.

పెరిగిన వేరుశనగ సాగు

వరంగల్, హన్మకొండ జిల్లాలో ఈసారి వేరుశనగ సాగు పెరిగింది. వరంగల్ జిల్లాలో 84 ఎకరాలు, హన్మకొండలో 41ఎకరాలు పెరిగింది. వరంగల్ జిల్లాలో గత ఏడాది వేరుశనగను 873 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 957ఎకరాల సాగు చేశారు. హన్మకొండ జిల్లాలో గతేడాది 27ఎకరాలు సాగు చేయగా, ఈ ఏడాది 68 ఎకరాల మేరకు సాగు చేశారు.

గుప్త నిధుల కోసం రామప్ప శిల్పాలు ధ్వంసం

దేవాలయంపై కప్పు పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు

ఆలయం లోపల శివలింగాన్ని పెకిలించిన వైనం

రామప్ప దేవాలయం ఉప ఆలయాలకు రక్షణ కరువు

నవతెలంగాణ-ములుగు(వెంకటాపూర్)

యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పరిధిలోని ఉప ఆలయమైన గొల్లాల గుడి గుప్తనిధుల కోసం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఆదివారం మధ్యాహ్నం పురావస్తు శాఖ సిబ్బంది గొల్లాల గుడి దేవాలయం శుభ్రం చేయడానికి వెళ్లగా దేవాలయం పైకప్పు తీసి కిందపడేసి నిచ్చెన ద్వారా దుండగులు లోపలికి దూరినట్లు తెలుస్తోంది. దేవాలయం లోపల శివలింగంతో పాటు శిల్పాలను దుండగులు పడగొట్టారు. దేవాలయం లోపల పువ్వు ఆకారంలో ఉన్న శిల్పాన్ని పగలగొట్టి పక్కకు పడేశారు. దాని కింద గుప్తనిధులు ఉన్నాయని అనుమానంతో పగలగొట్టినట్లు తెలుస్తుంది. కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న గొల్లాల గుడి శిథిలావస్థలో ఉండగా కేంద్ర ప్రభుత్వ నిధులతో రెండేండ్ల క్రితం దేవాలయంలోని శిల్పాలతో పాటు శివలింగం పునరుద్ధరణ చేశారు. దేవాలయం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటుకు తాళం వేసి ఉంచుతున్నారు. ఆలయం ధూప దీప నైవేద్యం లేనప్పటికీ ఆలయం చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించి వచ్చే భక్తులు దర్శించుకునేలా ఏర్పాటు చేశారు. కానీ దేవాలయం భక్తుల దర్శనానికి పురవస్తు శాఖ వారు అనుమతించడం లేదు. పురావస్తు శాఖ అధికారులు దేవాలయానికి రక్షణ కల్పించడంలో విఫలమైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై స్థానిక ఎస్సై జక్కుల సతీష్ సంప్రదించగా పురావస్తు శాఖ సిబ్బంది ఆదివారం సాయంత్రం వచ్చి దరఖాస్తు ఇచ్చారని దర్యాప్తు చేసి దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.





సీఐడీ ఎస్పీకి ఘన స్వాగతం

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పసర గ్రామాన్ని ఆదివారం సీఐడీ ఎస్పీ రామ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పస్రా గ్రామస్తులకు రామ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. మండలంలోని పసర గ్రామానికి చెందిన డాక్టర్ పోరిక చంద్రకాంత్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చంద్రకాంత్ మామ అయినా రామ్‌రెడ్డి పసర గ్రామానికి వస్తున్న క్రమంలో సమాచారం తెలుసుకున్న చంద్రకాంత్ సహచరులు బంధుమిత్రులు స్నేహితులు తరలివచ్చి రామ్‌రెడ్డిని పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసి అభినందించిన వారికి అందరికీ రామ్‌రెడ్డి కతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణ తోపాటు స్వగ్రామంతో పాటు పని చేసిన ప్రతిచోటా అనేక సేవా కార్యక్రమాలలో ప్రజల మన్ననలను పొందారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కర్ణాకర్‌రెడ్డి, ప్రవీణ్, జంపయ్య, సునీల్, వెంకన్న, ఆఫ్రిద్, లక్ష్మణ్ నాయక్, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

ప్రభుత్వ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలనందించాలి..

నేడు భవన నిర్మాణ కార్మికుల ఛలో హైద్రాబాద్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఆగస్టు 21న సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించిన నేపథ్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. సీఐటీయూ, ఏఐటీయూసి, ఐఎఫ్‌టియు, బీఆర్‌టీయు, బీఎస్ఆర్‌కెఎస్, ఎస్‌బిఎస్‌కెఎస్, టిబిఎస్‌కెటియు తదితర సంఘాలన్నీ భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి సెప్టెంబర్ 10వ తేదీ నుండి ఆందోళనలకు పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పెద్ద ఎత్తున జాయింట్ యాక్షన్ కమిటీ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి 23న ఛలో హైద్రాబాద్ విజయవంతానికి కార్మికులందరూ తరలిరావాలని పిలుపునిచ్చింది. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరుతున్నారు. అన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ సెప్టెంబర్ 23వ తేదీన ఛలో హైద్రాబాద్ కార్మిక శాఖ కార్యాలయం (అంజయ్య భవన్) వద్ద ధర్నాలో భవన నిర్మాణ కార్మికులంతా వెల్ఫేర్ బోర్డు రక్షణ కోసం ఐక్యంగా, సంఘాలకు, జెండాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి భారీ ఎత్తున కార్మికులు హైద్రాబాద్‌కు తరలిపోనున్నారు.

చేతులు దులుపుకునే యత్నంలో రాష్ట్ర ప్రభుత్వం

తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుల నుండి అమలు చేస్తున్న ప్రమాద బీమాను రూ.6.30 లక్షల నుండి రూ.5.00 లక్షలకు తగ్గించి, సహజ మరణం బీమా రూ.1.30 లక్షలు, శాశ్వత అంగవైకల్యం రూ.5 లక్షలు, పాక్షిక అంగ వైకల్యం రూ.4 లక్షలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుంది. ఇందుకుగాను ఆగస్టు 21న ఇన్సూరెన్స్ కంపెనీలను టెండర్లకు ఆహ్వానించింది. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులుంటే కేవలం 15.9 లక్షల కార్మికులే బోర్డులో రెన్యూవల్ చేసుకున్న వర్కర్లుగా లెక్కలు చూపించారు.

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం..

ఢిల్లీ, పంజాబ్, హర్యానా, తమిళనాడు, కేరళ, కర్నాటక వంటి రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు అమలు చేస్తున్న పెన్షన్, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, స్వంత గృహ వసతి, వంటి పథకాలు అమలు చేస్తున్నా, మన రాష్ట్ర ప్రభుత్వం నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం గాని వున్న సంక్షేమ పథకాలకు ఇస్తున్న నిధులు పెంచడం, బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులందరినీ రెన్యూవల్ చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 2009 నుండి వెల్ఫేర్ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. ప్రస్తుతం ప్రమాద మరణానికి రూ.6.30 లక్షలు, సహజ మరణానికి రూ.1.30 లక్షలు, వివాహ, ప్రసూతి కానుక రూ.30 వేల చొప్పున తదితర సంక్షేమ పథకాలను అందచేస్తున్నారు. ఈ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు కొంత మేరకు ఇప్పటి వరకు రక్షణగా నిలిచాయి. విమర్శిస్తున్నాయి.

కార్మికుల సంక్షేమానికి నిధులు ఖర్చు చేయని కేంద్రం

కేంద్ర ప్రభుత్వం 2024 ఏప్రిల్ నాటికి దేశం మొత్తంలో వెల్ఫేర్ బోర్డు సెస్ రూ.1.12 లక్షల కోట్లు వసూలు చేశారు. రూ.64 వేల కోట్లను మాత్రమే ఖర్చు పెట్టారు. రూ.48,137 కోట్లను ఖర్చు చేయకుండా బోర్డుల్లోనే మిగిల్చారు. అన్ని రాష్ట్రాల కన్నా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో ఎక్కువ ఖర్చు పెట్టారు. కేరళలో రూ.3,457.32 కోట్ల సెస్‌ను వసూలు చేసి అంతే మొత్తం ఖర్చు పెట్టారు. దేశం మొత్తంలోనే 100 శాతం కార్మికులకు ఖర్చు పెట్టిన రాష్ట్రం కేరళ మాత్రమే కావడం గమనార్హం.

రాష్ట్రంలో ఇతర పథకాలకు కార్మికుల నిధులు మళ్లింపు

రాష్ట్ర ప్రభుత్వం 2024 జూలై నాటికి రూ.5,064 కోట్ల సెస్‌ను వసూలు చేశారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమానికి వెచ్చించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఇతర పథకాలకు మళ్లించడం విమర్శలకు తావిచ్చింది. వసూలైన సెస్‌లో కోవిడ్ సహాయం కోసం రూ.1,005 కోట్లు, ఐటిఐల కోసం రూ.326 కోట్లు, పిఎం ఆయుష్మాన్‌భవ రూ.93 కోట్లు, సిఎస్‌సి హెల్త్ స్కీమ్ రూ.298 కోట్లు మొత్తం రూ.2,222 కోట్లు కార్మికులకు కాకుండా ఇతర పథకాల్లో ఖర్చు పెట్టారు. బోర్డు ద్వారా మొత్తం రూ.4,263 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రూ.2,222 కోట్లను ఇతర పథకాలకు మళ్లించారు. కార్మికుల కోసం కేవలం రూ.2,041 కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను నేరుగా అందించాలన్న ప్రధాన డిమాండ్‌తో కార్మికులు ఛలో హైద్రాబాద్ నిర్వహిస్తున్నారు. 10 డిమాండ్లతో భవన నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ పేరిట అన్ని సంఘాలు పెద్ద ఎత్తున ఛలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయడానికి ఏర్పాట్లను పూర్తి చేశారు.

తల్లిదండ్రులను ఆదుకోకపోతే స్థిరాస్తి జప్తు

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

నవతెలంగాణ-ములుగు

నవ మాసాలు మోసి చిన్నప్పటి నుండి వయసు వచ్చేవరకు అల్లారి ముద్దుగా పెంచి చివరికి వివాహం చేసిన అనంతరం తల్లిదండ్రులను పట్టించుకోకపోవుతున్న యువకులపై సీనియర్ పౌరుల పోషణ చట్టాన్ని అమలుచేయబడునని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా వారసత్వపు ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకుని వ్యవసాయం చేస్తున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేస్తూ కేసులు నమోదు చేయ బడునని, కన్న తల్లిదండ్రులను వద్ధాప్యంలో కొడ ుకులు పట్టించుకోకపోతున్న ఈ సమయంలో ఈ చట్టాలను అమలు చేయడం జరుగుతున్నదని అన్నారు.కొద్ది రోజుల క్రితం ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన మామిడి శెట్టి చిన్న మల్లయ్య కు ఇద్దరు కుమారులు ఉండగా మల్లయ్య కు సంబంధించిన వ్యవసాయ భూమిని కొడుకుల అక్రమంగా పట్టా చేయించుకుని తల్లిదండ్రులను పట్టించుకోకపోవడంతో చిన్న మల్లయ్య మండలంలోని రెవెన్యూ అధికారులను సంప్రదించారు. ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, స్థానిక తహసిల్దార్ విజయభాస్కర్ విచారణ జరిపించగా అక్రమం చేసుకోవడం నిర్ధారణ కావడంతో టీఎస్, (పిఓ టి)1977 యాక్ట్ ప్రకారం తిరిగి భూమిని మల్లయ్య చెందే విధంగా నిర్ణయం తీసుకోవడంతో పాటు 2007 సీనియర్ పౌరుల పోషణ చట్టం ప్రకారం తల్లిదండ్రుల పోసిన భారం తీసుకోవాలని ఆయన కుమారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గొడిశాల సమ్మక్క భర్త రాజయ్య గత కొద్ది సంవత్సరాల క్రితం మతి చెందగా ఆమెకున్న ఇద్దరు కుమారులు పట్టించుకోకపోవడంతో దీనిపై సైతం విచారణ జరిపించి ఇద్దరు కుమారులు తల్లి పోషణ చూసుకోవాలని ఆదేశించడంతో పాటు ఖర్చులు నిమిత్తం ప్రతి నెల 2000 రూపాయలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగినదన్నారు. జిల్లాలో అధికారులు తీసుకున్న చర్యలపట్ల వద్ధులలో సంతోషం కనిపిస్తున్నదనీ,వద్ధులకు ఎవరైనా కొడుకులు పట్టించుకోని పక్షంలో జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయం లో సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.



అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

పోలీస్, ప్రెస్ అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు

జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

నవతెలంగాణ-ములుగు

అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, పోలీస్, ప్రెస్ అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. ఏటురునాగారం, మంగపేట గ్రామాలకు చెందిన పళ్ల రాంబాబు, పల్నాటి సతీష్, వద్ది కార్తీక్, మల్లెల కమలాకర్, వావిలాల జనార్ధన్, తాడూరు మధుకర్ అను వ్యక్తులు పోలీస్, ప్రెస్ రిపోర్టర్లమని అందులో వద్ది కార్తీక్ అనే వ్యక్తి తన చేతిలో స్టీలు రాడ్డు పట్టుకుని అతను పోలీస్ కానిస్టేబుల్ అని, అయ్యవారిపేట నుండి ఎటురునాగరం వెళ్తున్న డీసీఎం వ్యానును ఆపి, ఎండి సద్దాం హుస్సేన్ ఏటూరునాగారం అను వ్యక్తిని 20వేల రూపాయలు ఇవ్వాలని లేకుంటే స్టీల్ రాడుతో చంపుతామని బెదిరించారన్నారు. డబ్బులు ఇవ్వకపోతే పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి కేసు పెడతామని బెదిరిస్తుండగా, అతను దిగి చూడగా, వాళ్లందరూ ఏటూరునాగారం, మంగపేట అని గమనించి అటుగా వస్తున్న లారీలను చూసి, అతను అరవగా వాళ్ళందరూ అక్కడినుండి వారి వాహనాలలో పారిపోయినారన్నారు. ఎండీ సద్దాం హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.చట్ట వ్యతిరేకంగా అక్రమ వసూళ్లకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని పోలీస్‌లు వాహనదారుల వద్ద అక్రమంగా వసూళ్లకు పాల్పడరని పోలీస్ ప్రతిష్ట దెబ్బతీసేలా కొందరు పోకిరీలు పోలీసులమని వసూళ్లకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

నవతెలంగాణ-ఏటూరునాగారం (ఐటీడీఏ)

రొయ్యూర్ సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాలను గోదావరి ముంపు బాధితులకు ఇప్పించాలని రొయ్యూర్‌కు చెందిన పలువురు బాధితులు ఆదివారం కాంగ్రెస్ నాయకులకు విన్నవించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ రొయ్యూర్‌కు చెందిన పలువురు ఇళ్ల స్థలాలు కావాలని తమకు విన్నవించారన్నారు .ప్రభుత్వం దష్టికి తీసుకెళామన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, మాజీ జడ్పీటీసీ ఎన్‌కేసీ చందు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, మండల ఉపాధ్యక్షులు ఎండీ రియాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు, మాజీ వార్డ్ మెంబెర్స్ కొండగొర్ల నర్సింహులు, కె రంజిత్, జోడే నర్సయ్య, గంపల శివకుమార్, పడిదాల లక్ష్మీనారాయణ, సంద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ యువత హక్కులపై అగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని మేడారంలో అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షులు సిద్ద బోయిన భోజరావు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల యువజన సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నికి మండలంలోని 25 గ్రామల అధ్యక్షులు, కార్యదర్శిలు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్రా నాయకులు కోర్నిబెల్లి గణేష్ హాజరై మాట్లాడారు. ఆదివాసీ యువత భారత రాజ్యాంగం, ఆదివాసీ హక్కులు చట్టలపై అవగహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు వస్తేఉమ్మడి పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా సమ్మక్క సార్లమ్మా ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవి మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు విద్య నీర్లక్ష్యం చేయకూడదని, ప్రభుత్వం విద్య అవకాశలు అన్ని రకాల సేవలు అందిస్తున్నారని, ప్రతి ఆదివాసీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య ద్వారా నే మన జాతి అభివద్ధి అవుతుంది అని తెలిపారు. తుడుందెబ్బ మండలం అధ్యక్షులు మోకాళ్ల వెంకటేష్, మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామలలో 'మాగూడెంలో, మా రాజ్యం' కోసం కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
సోమవారం సెప్టెంబర్ 23, 2024

నేడు ఛలో హైదరాబాద్ లేబర్ కమిషనరేట్ ఆఫీస్ ధర్నా

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుల్లా అశోక్

నవతెలంగాణ హసన్పర్తి

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని కోరుతూ నేడు ఛలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్ కోరారు. తెలంగాణ భవన,ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ ల ద్వారా అప్పగించి, ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరి కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కొరకే ఖర్చు చేయాలని అన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని అన్నారు. ఈ మేరకు నేడు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్మికశాఖ కార్యాలయం అంజయ్య భవన్ వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులంతా వెల్ఫేర్ బోర్డు రక్షణ కోసం ఐక్యంగా సంఘాలకు, జెండాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్ కోరారు.

నెలలు గడుస్తున్నా..

అందని రూ.500కే గ్యాస్ సిలిండర్ !?

నవతెలంగాణ-వేలేరు

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 500 కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చిన విషయం విధితమే. ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి నెలలుగడుస్తున్నా మండల కేంద్రం వేలేరుతో పాటు 14 గ్రామాలలోని ప్రజలకు ఇది పూర్తిస్థాయిలో అమలు కాని పరిస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోతున్నారు. అర్హులు ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా లబ్ధిచేకూరట్లేదని చెబుతున్నారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందక ఇటు ఎంపీడీవో ఆఫీసు, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఏదైనా సమస్య ఉంటే ఎంపీడీవో ఆఫీసులో ప్రజా పాలన దరఖాస్తు ఇవ్వాలని ప్రభుత్వ చెబుతోంది. దరఖాస్తులు ఇచ్చి నెలలు గడుస్తున్నా గ్యాస్ సిలిండర్ అందకపోవడం గమనార్హం. ఎంపీడీవో ఆఫీసులో ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, గ్యాస్ కన్స్యూమర్ నెంబర్ మ్యాచింగ్ అయిన కూడా వారి ఖాతాలో డబ్బులు జమ కావడం లేదు. ఇట్టి విషయంపై ఎంపీడీవో ఆఫీస్‌లో అడిగితే, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సంప్రదించాలంటున్నారు. గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సంప్రదిస్తే ఎంపీడీవో ఆఫీస్ వాళ్ళని సంప్రదించాలంటున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ- నయీంనగర్

ఉద్యోగరీత్యా సుదీర్ఘకాలం శాఖపరమైన సేవలను అందించి విశ్రాంత జీవితం గడుపుతున్న విశ్రాంత ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం అభినందనీయమని సమాచార పౌర సంబంధాల శాఖ పూర్వపు సంచాలకులు బి రాజమౌళి అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లి జంక్షన్ సమీపంలోని శ్రీమాత బంకేట్ హాలులో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విశ్రాంత ఉద్యోగులలో ఆత్మీయ అనుబంధంతోపాటు ఆత్మ స్థైర్యం పెంపొందుతుందని అన్నారు. శాఖా పరంగా జిల్లా స్థాయిలో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రంలో ప్రథమమని పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న ధోరణిలో కార్యక్రమాన్ని రూపకల్పన చేయడం అందరిలో ఒక నూతన ఉత్తేజాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తుంది అన్నారు. ఇలాంటి దృక్పథం ఇతర జిల్లాలకు కూడా మార్గదర్శకం అవుతుందని ఆకాంక్షించారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విశ్రాంత అధికారులు సిబ్బంది తమ అనుభవాలను అభిప్రాయాలను వ్యక్తంచేశారు ఈ కార్యక్రమంలో విశ్రాంత అధికారులు పాకాల భాస్కర్, ముర్తుజా, వెంకటనారాయణ, మల్లయ్య, ఇమ్మానియేల్, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, సారయ్య, విధుమౌళి, సుధాకర్, దేవేందర్ రెడ్డి, సుదర్శన్ -వయోవద్ధులు కట్టయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరూ ఆహ్లాదకర వాతావరణంలో సామూహిక భోజనం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విశ్రాంత ఉద్యోగులకు విశ్రాంతి అధికారి పాకాల భాస్కర్ కతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మెల్యే రేవూరికి రేషన్ డీలర్ల వినతి



నవతెలంగాణ - నడికూడ

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనంతో పాటు రూ.300 కమిషన్ అందించే విధంగా ప్రభుత్వం దృష్టికి మా సమస్యలను తీసుకెళ్లాలని కోరుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి రేషన్ డీలర్లు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గం పరిధి 6 మండలాలు నడికూడ, పరకాల, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం మండలాల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాణి, రామరాజు, పోచయ్య, శంకర్ రావు, రాజేందర్ రెడ్డి, ఉమెందర్ గౌడ్, సర్వేశం, తదితరులు పాల్గొన్నారు.

దామెరలో ఉచిత ఎముకల వైద్య శిబిరం

నవతెలంగాణ-దామెర



దామెర మండల కేంద్రంలో ఆదివారం వీణ మెడికేర్ హాస్పిటల్, శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి అశోక్, డాక్టర్ రాకేష్, డాక్టర్ సంతోష్, డాక్టర్ మానస శ్రీరాం ఫౌండేషన్ చైర్మన్ గురజాల శ్రీరామ్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజకుమార్, శివ, రామనాథం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి సంజయ్‌కి ఘన స్వాగతం

నవతెలంగాణ-పరకాల

భారతీయ జనతా పార్టీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని తిరిగి పరకాల మీదుగా హైదరాబాదుకు వెళుతున్న క్రమంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ కూడలిలో సాయంత్రం భారతీయ జనతా పార్టీ పరకాల శాఖ నాయకులు నిరంజన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్రం రామన్న, బాస్కరాచారి, సూర్యదేవర సదానందం, ఆకుల రాంబాబు, మిడిదిడ్డి నరేష్,జనార్ధన్,ఆకుల శ్రీధర్, పాలకుర్తి ప్రతాప్, దేవందర్, సతీష్,రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పెన్షన్ పథకంపై నేడు కేయూలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

కాకతీయ విశ్వవిద్యాలయం టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల కోసం నేడు కాకతీయ విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు టీచింగ్, నాన్ టీచింగ్ సంఘాల బాధ్యులు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ సహకారంతో నేషనల్ పెన్షన్ స్కీమ్ పై ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు డాక్టర్ మామిడాల ఇస్తారీ(టీచింగ్ అసోసియేషన్), వి తిరుపతి, పీ కార్నెల్ (నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం) ఒక ప్రకటనలో తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ప్రొఫెసర్ ఎస్. ఉదయభాస్కర్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగుల ఆర్థిక ప్రణాళిక పదవీ విరమణ సంసిద్ధతను పెంపొందించే లక్ష్యంతో ప్రొఫెసర్ భాస్కర్ నేషనల్ పెన్షన్ స్కీమ్‌పై విలువైన సమాచారాన్ని అందిస్తారని అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు.

దేశం కోసం సీతారాం ఏచూరి పోరు

సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపెల్లి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ-సుబేదారి

దేశం కోసమే సీతారాం ఏచూరి జీవితకాలం పోరాటం చేసారని సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపెల్లి వాసుదేవరెడ్డి అన్నారు. 31 వ డివిజన్ దీందయాల్ నగర్, యూటీఎఫ్ భవన్‌లో సీతారాం ఏచూరి సంస్మరణ సభ పార్టీ హన్మకొండ సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో పుట్టి అణగారిన వర్గాల కోసం పోరాటం చేసాడని అన్నాడు. విద్యార్థి ఉద్యమం రూపకల్పనలో ఏచూరి ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. యుపిఎ-1 ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టం, గిరిజన హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి సాధించడంలో సఫలీకృతులయ్యారన్నారు. 2024 ఎన్నికల్లో ఇండియా కూటమి ఏర్పాటులో కీలక భూమిక పోషించి మతతత్వ బిజెపికి బ్రేకులు వేశారని తెలిపారు. సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టులకే కాదు, దేశ ప్రజలకు, రాజకీయాలకు తీరని లోట ని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థిక వేత్తగా, సామాజిక కార్యకర్తగా ఏచూరి సేవలు మరువలేనివని, దేశంలో అందరికీ సుపరిచితులయ్యారని చెప్పారు. జాతీయ స్థాయిలో అనేక పదవులు లభించే పరిస్థితి ఉన్నా నిరాడంబర రాజకీయవాదిగా జీవితం గడపడం ఆయన ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ప్రజా స్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, లౌకిక తత్వాన్ని నిలబెట్టే దిశగా ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. సీతారాం ఏచూరి లోటు పూడ్చలేనిదని అన్నారు. వారి ఆశలను కొనసాగించేందుకు పార్టీసభ్యులు, శాఖ కార్యదర్శిలు గా ముందు ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అలకుంట్ల యకయ్య, నోముల కిషోర్, బొల్లారం సంపత్, ఎన్నాం వెంకటేశ్వర్లు, కంచర్ల కుమారస్వామి, పల్లకొండ శ్రీకాంత్, శ్వేతా, దుర్గ, సంపత్, రమ, కావ్య, నవ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత పరిపాలనా అధికారులను అందించిందే పొలిటికల్ సైన్స్ విభాగం

- కేయూ రిజిస్ట్రార్ పీ మల్లారెడ్డి
- రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



మంచి పరిశోధనలు, పరిశోధకులు, పరిపాలన అధికారులను అందించింది పొలిటికల్ సైన్సు విభాగం అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ పొలిటికల్ సైన్సు విభాగ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం విభాగ అధిపతి డాక్టర్ సంకేనేని వెంకట్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పరిశోధనలు సమాజ హిత, సమాజ అవసర పరిశోధనలు చేయాలనీ, సిలబస్‌లో నూతన అంశాలు జోడించాలన్నారు. ముఖ్యంగా వోటర్ పల్స్, పీపుల్ పల్స్, పీపుల్ బెవియర్, ఎంప్లాయబిలిటి పెంచేలా సిలబస్ ఉండాలన్నారు, పరిశోధనలో నాణ్యత ఉండాలి అన్నారు. పూర్వ విద్యార్థులు విభాగ అబివృద్ధిలో కీషి చేయాలని అన్నారు. విభాగంలో ఐసిటి క్లాసు రూమ్‌ను అబివృద్ధి చేసుకోవాలని అన్నారు. దూర విద్య సంచాలకులు ఆచార్య వి రామచంద్రం మాట్లాడుతూ పరిశోధనలు పెరగాలని, డిపార్టుమెంటు ఎంతో మంది కి మార్గ దర్శకం వహించింది అని అన్నారు. సామజిక రుగ్మతలను పారద్రోలటంలో ముందు ఉండాలి అన్నారు. విశ్రాంత ఆచార్యులు ఆచార్య దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆబ్జెక్టివ్‌తో పని చేయాలనీ, సెమినార్‌లు సమాజ హితంగా ఉండాలని, పరిశోధనలో నాణ్యత తగ్గిందని తెలిపారు. ఆచార్య జి.వీరన్న మాట్లాడుతూ పే బ్యాక్ టూ సొసైటీ మన పూర్వ విద్యార్థులు కలిగి ఉండాలని, పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహించటం అబినందనీయం అన్నారు. మరిన్ని సమావేశాలు నిర్వహించి, నిర్మాణాత్మక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం తెలంగాణా రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ యూనివర్సిటీకి రుణపడి ఉంటాం అని అన్నారు. విభాగ గ్రంథాలయానికి కృషి చేస్తానని అన్నారు. పొలిటికల్ సైన్సు జీవితంను నేర్పింది అన్నారు. ఏసీపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ చదువు పై శ్రద్ధ పెట్టాలి అన్నారు. విభాగంలో సెమినార్ హాల్ కొరకు, జాతీయస్థాయి సెమినార్ నిర్వహణకు సహకారం అందిస్తామని అన్నారు. 1986 నుంచి 2024 వరకు ఉన్న విద్యార్థులు పాల్గొని తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిఎల్‌సి డైరెక్టర్ రామచంద్రం, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు డాక్టర్ కృష్ణయ్యతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ - శాయంపేట

44 ఏళ్ల క్రితం పాఠాలు చదివి, చదువు ముగించుకొని వెళ్లిపోయిన మిత్రులంతా ఆదివారం ఒకే వేదికగా కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979 - 80లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం శాయంపేటలోని ఎస్‌వికే కె ఫంక్షన్ హాలులో ఒకే వేదికగా కలుసుకున్నారు. ముందుగా తమతో పాటు చదువుకొని అమరులైన తోటి మిత్రులు, ఉపాధ్యాయులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు పరిచయ కార్యక్రమం చేసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులు వేముల ప్రతాపరెడ్డి, బేరి యాదగిరి, సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి లను పూలమాలలు, శాలువా, మెమొంటో, బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కన్వీనర్ కే. రవికుమార్, అంకేశ్వరపు సాంబయ్య, వేముల అశోక్ రెడ్డి, పున్నం వీరారెడ్డి, కుసుమ రాజేంద్రప్రసాద్, కందగట్ల రాజేందర్, కుసుమ అశోక్, పసునూటి రమేష్, పైడిమల్ల కోటి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలపై పెట్టడం జాప్యానికి అవకాశం : వక్తలు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డిఎల్‌సి కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. పలువురు ప్రముఖులు, మానవ హక్కుల వేదిక నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. 30 ఏండ్ల పోరాటం తర్వాత ఎస్సీ వర్గీక రణపై సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పు ఇవ్వకుండా బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలపై పెట్టటం సమస్యను జాప్యం చేయడానికి అవకాశం ఇచ్చినట్లుగా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు.

అయినప్పటికీని ఆలస్యంగా నైనా వర్గీకరణ చేసుకోవచ్చు అని ఇచ్చిన తీర్పును అన్ని పక్షాల వారు స్వాగతించారు. చివరిగా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమో దించింది. ఒక కాలపరిమితితో రాష్ట్ర ప్రభుత్వం వెం టనే వర్గీకరణ చేపట్టడానికి షెడ్యూల్ను ప్రకటించాలి. ఎన్నికల హామీ కుల గణనను వెంటనే చేపట్టాలి. ఇప్పటివరకు అమలవుతున్న 50శాతం రిజర్వేషన్ల పరిమితిని వెంటనే ఎత్తివేసి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లను అమలు పరచాలి. ప్రమోషన్లలో ఎస్సీ ఎస్టీలకే కాదు బీసీలకు సైతం రిజర్వేషన్లు కల్పించాలి. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను అమలు చేయాలి. ఇప్పటికీ రిజర్వేషన్లు అమలు పరచని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలలో వెంటనే అమలు పరచాలి. క్రీమీ లేయర్ నిబంధనను వెంటనే రద్దు పరచాలని వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ తిరుపతయ్య, టి హరికృష్ణ, అద్దునూరి యాదగిరి వీ దిలీప్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరునహరి శేషు, ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు మంద కుమార్, వీసీకె పార్టీ అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, సురేష్, వెంకటనారాయణ, జి పద్మజ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్

నవతెలంగాణ - శాయంపేట



మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన కర్రు సంపత్ ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షుడు గౌరీశెట్టి సత్యనారాయణ తెలిపారు. హనుమకొండలోని ఏకశిలా పార్కులో జిల్లా పరిధిలోని 14 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవా ధ్యక్షునిగా రాచర్ల సారంగపాణి, కార్యదర్శిగా పెరుమాళ్ళ ఆగస్టాన్, కోశాధికారిగా కడవెండి రమేష్, ఉపాధ్యక్షుడిగా మియాపురం శివుడు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ఆర్.ఎం.పి, పిఎంపి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ బినామీల్లో సృజన్‌రెడ్డి ఒకరు ?

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



కేటీఆర్‌కు ఉన్న బినామీల్లో సృజన్‌రెడ్డి ఉన్న విషయం వాస్తవం కాదా అనేది తెలంగాణ ప్రజలందరికీ తెలుసని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ ఎద్దేవ చేశారు. ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. టెండర్లలో సృజన్ రెడ్డి కంపెనీకి టెండర్ వచ్చిందని కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని, అయితే టెండర్లు పిలిచినప్పుడు ఆర్థికంగా సాంకేతికంగా అనుభవం ఉన్న కంపెనీలు టెండర్లలో పాల్గొంటాయి కదా స్టార్ టాప్ కంపెనీలు ఆర్థికంగా ఉండి సాంకేతిక అనుభవం లేని కార ణంగా సాంకేతికంగా అనుభవం కలిగిన కంపెనీలతో జాయింట్ వెంచర్ పెట్టు కొని టెండర్లలో పాల్గొంటారనే సంగతి కేటీఆర్‌కు తెలియదా అన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కాలంలో హెచ్ఎండిఏ పరిధి భూములను కన్వర్షన్ చేశారు? ఎన్ని బహుళ అంతస్తుల భవనాలకు అను మతులు ఇచ్చారో అందరికీ తెలుసన్నారు. ఈ అనుమతుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. వెయ్యి కోట్ల రూపాయల యాదాద్రి పునర్నిర్మాణ పనులను ఏఅనుభవం లేని సినిమా ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయితో జరిపించింది బీఆర్ఎస్ అని ఆరోపించారు. మల్టీ నేషనల్ కంపెనీ ఆర్కిటెక్ట్ నిపుణులతో యాదాద్రి పనులు చేయాల్సి ఉండగా చిన జీయర్ స్వామికి అప్ప జెప్పారన్నారు. అతనికి రూ.30 కోట్లు ఎందుకు చెల్లించారని ప్రశ్నించారు. యాదాద్రి దేవాలయ పనుల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచా రణ చేయాలని కోరారు. బీజేపీ - బీఆర్ఎస్ రహస్య మిత్రులు అనడానికి కవితకు బెయిల్ రావడమే నిదర్శనం అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకోం అన్నారు. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే సమగ్ర విచారణ జరిపి ప్రజల ముందు వాస్తవాలను ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో దేవేందర్, నిఖిల్, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సహించం

- జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వీరమల్లరంజిత్ రెడ్డి

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోకసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వీరమల్ల రంజిత్‌రెడ్డి ప్రకటనలో హెచ్చరించారు. రాహుల్ గాంధీపై బీజేపీ నేత తన్వీందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలు అక్షేపనియమని అన్నారు. రాహుల్ గాంధీ బయటకు వస్తే ఇందిరాగాంధీకి పట్టినగతే రాహుల్ గాంధీకి పడుతుందని, బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు తీవ్రమైనవిగా పరిగణించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తల్లి సోనియా గాంధీ క్రియాశీల పాత్ర పోషించారని గుర్తు చేశారు. దానికి సూచికంగా మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సమేతంగా సోనియా గాంధీ ఇంటికి వెళ్లి, ఆనాడు ఆశీర్వాదం తీసుకొని, కతజ్ఞత మరిచిన నేడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటారా ? ప్రజా నాయకులు సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్నిఆవిష్కరిస్తే అభినందించాల్సింది పోయి, విమర్శిస్తారా? అంటూ హెచ్చరించారు. రాజీవ్ గాంధీ కుటుంబం వల్లే నేడు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత పదవులు అనుభవించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. హింసను ప్రేరేపించేలా, నేరపూరితమైన వ్యాఖ్యలు చేసిన తన్విందర్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీపీ నివాళులు

నవతెలంగాణ - శాయంపేట



మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దూదిపాల ఆదిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించాడు. మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి సందర్శించి ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పిఏసిఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ దూదిపాల రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆడిదల సునీత సాంబరెడ్డి, నాయకులు దూదిపాల మోహన్ రెడ్డి, మారపల్లి మోహన్, అరికిళ్ళ దేవయ్య పాల్గొన్నారు.



రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ను కలిసిన కేయూ విద్యార్థులు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆదివారం కాకతీయ యూనివర్సిటీకి విచ్చేసిన సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై కేయు యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అంతర్జాతీయ క్రీడాకారుడు ,కాకతీయ యూనివర్సిటీ జేఏసీ ఆలోజీ, అశోక్ నాయక్, నరేష్‌నాయక్ తదితరులు పలు సమస్యలపై వినీతి పత్రం ఇవ్వడం జరిగింది. సివిల్స్ కోచింగ్ సెంటర్, ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ సానుకూలంగా స్పందిస్తూ పలు సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చినట్టు చెప్పారు.

నిఘా నేత్రాలు అమర్చుకోవాలి

- సీఐ నరేష్ కుమార్



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

నేరాల నియంత్రణ కోసం నిఘా నేత్రాల అమర్చుకోవాలని సీఐ నరేష్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీ లో కాలనీ ప్రజలు ఏర్పాటు చేసుకున్న ఆరు సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు నేరాలను అదుపు చేయడానికి నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడ తాయని అన్నారు. నేరం జరిగినప్పుడు విచారణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పట్టణ వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

ఈ నెల 23 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ సాఫ్ట్ బాల్ క్రీడలకు మండలంలోని మొట్లపల్లి జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బొమ్మ సందీప్ తెలిపారు. ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న కలాస,మిశ్రుతి జన్ను ఇందు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లిం గాల కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించడం అభినందనీయమని అన్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ కరుణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సింహ స్వామి,సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, గ్లోరీ రాణి, రవీందర్, శోభారాణి శకుంతల, కవిత, వసంత, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని వినియోగించుకోవాలి : కాంగ్రెస్

నవతెలంగాణ-చిట్యాల



ఏఐసీసీ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ మహిళలకు సభ్యత్వం కల్పిస్తోందని, దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు, చిట్యాల వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం జనాభాలో సగభాగం మహిళలకు పెద్దపీట వేయాలని, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయిలో నిలపాలని సభ్యత్వం కల్పి స్తున్నట్లు వివరించారు. మహిళలంత కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకుంటేనే వారికి మనుగడ ఉంటుందని, పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలి పారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతూ సభ్యత్వం తీసుకోవా లన్నారు. జిల్లాలో ప్రతి కార్యకర్త, ముఖ్య నాయకులు, బాధ్యత తీసుకొని మహిళా సభ్య త్వాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ మొరం రవాణాపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-చిట్యాల

విచ్చలవిడిగా అక్రమంగా మొరం రవాణా కొనసాగుతుందని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిట్యాల మండలంలోని నవాబపేట శివారులోని గుట్ట ప్రాంతం నుండి కోట్ల విలువ గల ఐరన్ మట్టిని గుట్టల నుండి తీసి వేరే చోట డంప్ చేసి రాత్రికి రాత్రే లారీలల్లా తరలిస్తున్నారని ఆరోపించారు. అక్రమార్కులు కోట్లు దండుకుంటున్న రెవెన్యూ శాఖ చూస్తూ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చట్ట వ్యతిరేకంగా సహజ వనరులను దోపిడీ చేస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ శాఖ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్ మాదిగ, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ శిలపాక హరీష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధార్థ' పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భూపాలపల్లి పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల 2004-2006 సీఈసీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ బిలుగు రాజేశ్వర్, ప్రిన్సిపాల్ నరసింహస్వామి, డైరెక్టర్లు బానోతు బాలునాయక్, రెడ్డి రవీందర్, సురేష్, భాను ప్రకాష్ అధ్యాపకుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థులు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 20 సంవత్సరాల క్రితం ఇంటర్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు నేడు వివిధ స్థాయిలలో పనిచేస్తూ ఉంటూ వారి విలువైన సమయాన్ని ఆత్మీయ సమ్మేళనం కోసం కేటాయించారు. అధ్యాపకులకు పూల బొకేలు,మెమెంటోలు అందజేస్తూ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు చేసిన నాట్యం,డాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని 40 రోజులుగా 80మంది విద్యార్థులను కోఆర్డినేషన్ చేసిన బానోత్ రాజ్ కుమార్, నారా సత్యనారాయణ, కూనమల్ల తిరుపతి, జిల్లాల తిరుపతి, స్రవంతిని కరస్పాండెంట్, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు.

కేంద్రమంత్రిని కలిసిన బుర్ర వెంకటేష్‌గౌడ్

నవతెలంగాణ-చిట్యాల

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్రం మత్స్య, పశుసంవర్ధక డైరీ, మైనార్టీ శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్‌ను బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా చిట్యాల మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రానికే చిట్యాల మండలాన్ని సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలుపాలని కేంద్రమంత్రి సూచించారు.

షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం, రూ.2లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-రేగొండ



ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్తో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలోని తిరుమలగిరి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి గ్రామానికి చెందిన అల్లే స్వప్న వ్యవసాయ పెట్టుబడి కోసమని రెండు రోజుల క్రితం 50 వేల రూపాయలను అప్పుగా తీసుకొచ్చి ఇంట్లో ఇనుప డబ్బాలో పెట్టి ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం తన భూమి వద్దకు వెళ్ళింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్ కావడంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. దీంతో రూ.50వేల నగదుతోపాటు, అర్ధ తులం బంగారం, టీవీ, కూలరుతోపాటు ఇంట్లోని సామాను పూర్తిగా కాలిపోయాయి. దీంతో సుమారుగా రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని, బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈసారైనా వచ్చేనా?

-రేషన్ కార్డుల కోసం మరోసారి దరఖాస్తుల ఆహ్వానం -ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేదలు

నవతెలంగాణ-మల్హర్ రావు.

కొత్త రేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దరఖాస్తులు ఆహ్వానించింది. ఇప్పటికే పలు దఫాలుగా పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అవి పెండింగ్లో ఉండగానే అక్టోబర్ 2నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈసారైనా కొత్త రేషన్ కార్డులు వచ్చేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో మొత్తం రేషన్ దుకాణాలు 19 ఉండగా మొత్తం రేషన్ కార్డులు 8,906 ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 1,385, ఆహార భద్రత కార్డులు 7,521 ఉన్నాయి. యూనిట్లు 24,709 కాగా నెలసరి బియ్యం సరఫరా 3,99,0,35క్వింటాళ్లు ఉంది. ఈ నేపథ్యంలో గతంలో చేసుకున్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారా..? అందరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తారా తెలియాల్సి ఉంది. ఇక పేర్ల మార్పులు, చేర్పుల కోసం మండలవ్యాప్తంగా ఇప్పటికే 347మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. పలుమార్లు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం కావాలన్నా, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. రేషన్ కార్డు లేక అల్పాదాయ వర్గాల వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే ప్రభుత్వం నూతనంగా కార్డులు జారీ చేస్తామని చెప్పినా.. వాటి విధి విధానాలు విడుదల కాకపోవడంతో అనేక మందిలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

లబ్ధిదారుల్లో ఆందోళన

కాగా ప్రభుత్వ ప్రకటనతో ప్రస్తుతం తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తవుతోంది. ఇప్పటి వరకు లబ్ధిదారుల వద్ద అంత్యోదయ, ఆహార భద్రత,అన్నపూర్ణ కార్డులున్నాయి. ప్రభుత్వం మాత్రం స్మార్ట్ కార్డులు జారీ చేస్తారని తెలిపింది. రేషన్ కావాల్సిన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు, అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్ కార్డులు మంజూరవుతాయి. మరోవైపు వార్షిక ఆదాయాన్ని కూడా సవరిస్తారని తెలుస్తోంది. వీటిని పరిశీలిస్తే కొత్తగా జారీ చేసేవి మాత్రమే స్మార్ట్ కార్డులుగా ఉంటాయా..? లేక అందరికీ అవే ఇస్తారా అనేది ఇంకా తేలలేదు.



సందేహాలు అనేకం...

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏండ్లు గడిచినా కార్డులు మాత్రం జారీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తు చే శారు. అయితే మండలంలో రేషన్ కార్డుల కోసం ఎన్ని దర ఖాస్తు వచ్చాయనే దానిపై స్పష్టత లేదు. ఇవన్నీ ఇలా ఉండగా, మరోసారి ప్రభుత్వం రేషన్ కార్డులకు దరఖాస్తులను ఆహ్వానించడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ డైరెక్టర్ పదవుల కోసం 36మంది దరఖాస్తు

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర దేవస్థానం చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ఇటీవల దేవదాయ ధర్మాదాయశాఖ దరఖాస్తులకు ఆహ్వానించగా 36 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు బాల్యమిత్రుడు సిద్దిపేటకు చెందిన వెంకటేష్‌కు రెండుసార్లు అవకాశం కల్పించగా కరోనా సమయంలో వెంకటేష్‌కు చైర్మన్ పదవి కాకముందే కరోనా వచ్చి మృతిచెందాడు. దీంతో ఒక సంవత్సరం పాటు కాళేశ్వరానికి చెందిన డైరెక్టర్ రామ్‌నారాయణగౌడ్‌కు చైర్మన్ వచ్చింది. ఆ తర్వాత 2023లో బీఆర్ఎస్‌లో మొదట నుండి పార్టీకి అండగా ఉన్న అంబటిపెల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి శ్రీనివాసరావుకు మూడవసారి చైర్మన్ పదవి లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేవదాయ ధర్మాదాయశాఖ కాంగ్రెస్ దేవస్థానం చైర్మన్ డైరెక్టర్‌ల కోసం నోటిఫికేషన్ విడుదల చేయగా 36మంది దరఖాస్తు చేసుకున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. చైర్మన్ పదవి కోసం కాళేశ్వరం నుండి ముగ్గురు మహాదేవపూర్ నుండి దరఖాస్తులు చేసుకున్నారు. ముఖ్యంగా కాళేశ్వరం నుండి కామెడీ శ్రీనివాస్‌రెడ్డి, మహాదేవపూర్ నుండి వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇద్దరి మధ్య గట్టి పోటీ ఉన్నట్టు సమాచారం. వీరిద్దరితోపాటు మరికొంతమంది మంత్రి డి శ్రీధర్‌బాబు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శీను బాబు ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేశారు. కాళేశ్వరం నుండి శ్రీనివాసరెడ్డి గతంలో జెడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోగా మహాదేవపూర్ శ్రీనివాస్ రెడ్డి జెడ్పీటీసీ అవకాశం వచ్చినా.. పార్టీ కోసం పోటీ నుండి విరమించుకున్నారు. ఏది ఏమైనా వీరిద్దరి మధ్య గట్టి పోటీపడిందని, వీరిలో ఒక్కరికి చైర్మన్ పదవి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం. వీరిద్దరిలో ఎవరో ఒక్కరికి మంత్రి అవకాశం ఇస్తాడని సమాచారం. అదేవిధంగా ఐదు మండలాలైన మహాదేవపూర్, కాటారం, మహా ముత్తారం, మల్హర్, పలిమెల, మల్హర్‌రావు నుండే డైరెక్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

విద్యుత్ ఉద్యోగులపై తేనెటీగల దాడి



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్యుత్ మరమ్మతులు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులపై తేనెటీగలు దాడి చేసిన ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం లైన్‌మెన్ సోమిశెట్టి తిరుపతి, అసిస్టెంట్ లైన్‌మెన్స్ మెరుగు మహేష్, తుల అనిల్, అన్‌మ్యాన్డ్ కార్మికుడు రవి నలుగురు కలిసి ఏఈ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని బాంబుల గడ్డ సమీపంలో నందిగామకు సరఫరా అయ్యే 33కేవీ లైన్ మరమ్మతు చేయడానికి వెళ్లారు. లైన్‌పై ఉన్న చెట్లను తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో సోమిశెట్టి తిరుపతి, మెరుగు మహేష్, తుల అనిల్ ,అన్ మ్యాన్ కార్మికుడు రవి గాయాలపాలయ్యారు. హుటాహుటిన విద్యుత్‌శాఖ వాహనంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరారు. గాయపడ్డ వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందజేస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనలో లైన్‌మెన్ చరవాణి పోగొట్టుకున్నట్లు బాధితులు తెలిపారు.

గ్రామీణ వైద్యులు నిబంధనలు పాటించాలి

ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు

నవతెలంగాణ-మల్హర్‌రావు/మహాముత్తారం

గ్రామీణ వైద్యులు నియమ, నిబంధనల పాటించాలని, పరిమితికి మించిన వైద్యం చేయొద్దని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మీడుదొడ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్ సూచించారు. ఆదివారం మహాముత్తారం మండలంలోని యమాన్‌పల్లి గ్రామ పరిధిలో గల సమ్మక్క సారలమ్మ గద్దెల ఆవరణలో మండల అధ్యక్షుడు కాసర్ల రాజ్ కుమార్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడారు ప్రభుత్వం గ్రామీణలకు వ్యతిరేకంగా లేదన్నారు. పారా మెడికల్ శిక్షణ తరగతులు పునర్‌ప్రారంభం కోసం ఆయా నియోజకవర్గ వర్గాల్లో, మండలాల్లో ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయాలన్నారు. గ్రామీణ వైద్యులు ఐక్యంగా ముందుకు వెళుతు హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇసి మెంబర్ రవి,లక్ష్మన్, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు రవి, కోశాధికారి సమ్మయ్య, రంగయ్య, రమేష్ పాల్గొన్నారు.



నేత్రపర్వంగా మహాయాగం

ఎస్ఐ రేఖ అశోక్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం సుదర్శన మహయాగం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోవర్ధన దుర్వాస చార్యులు, వేదపండితులు గోవర్ధన వేణుగోపాల చార్యులు, గోవర్ధన శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో మహాయాగం చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన పరాంకుశం శేషాచార్యులు, కృష్ణమాచార్యులు, పరాశరం వెంకట రత్నమాచార్యుల ఆధ్వర్యంలో మొత్తం 11 ఆలయాల్లో మహా మోమంలో భాగంగా 10వ ఆలయం పట్టాభి రామాలయంలో ఈ మహాయాగం కొనసాగింది. స్థానిక ఎస్ఐ రేఖ అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు సముద్రాల సంపత్ కుమార్ ఆచార్యులు, నారాయణ చార్యులు, శ్రవణ్ కుమార్ శర్మ, ప్రసాదాచార్యులు, అరుణ్ కుమార్, ఆచార్యులు, హరికృష్ణ ఆచార్యులు, లోకేష్ చార్యులు, విక్రమాచార్యులు, మామిడాల సింహాచారి, ప్రణీతచారి, నందగోపాలచార్యులు, కోటగుళ్ళు అర్చకులు జూలపల్లి నాగరాజు పాల్గొన్నారు.

తెల్ల బంగారం.. మెరిసేనా ?

- ఏపుగా పెరిగిన పత్తి పంట
- మండలంలో 3,120 ఎకరాల్లో సాగు

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఖరీఫ్ సాగులో 40శాతానికి పైగా పత్తి పంటే సాగవుతుంది. ఈసారి కూడా ఇదే పరిస్థితి. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న పత్తి మరికొద్ది రోజులు దాటితే కాయ పగిలే దశకు చేరుకోనుంది. పంట ఆశాజనకంగా ఉండ దంతో రైతులు దిగుబడిపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల తర్వాత కొద్ది రోజులుగా ఉష్ణో గ్రతలు పెరగడంతో మళ్లీ చిన్నపాటి వర్షాలు కురిస్తే పత్తికి మేలు జరుగుతుందన్న ఆశాభావంలో ఉన్నారు. ప్రధానంగా మండలంలో వర్షాధారంగానే 90 శాతానికి పైగా పంటలు సాగవుతాయి. ఒకవేళ వర్షం కురువకపోతే నీటి తడులు అందించాల్సి వస్తుంది. ఒకట్రెండు తడులు అందిస్తే పత్తి పూత, కాత మరింత పెరిగే అవకాశాలు ఉంటాయి. వ్యవ సాయశాఖ అంచనా ప్రకారం ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని చెబుతున్నారు. అంతకుమించి కూడా వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ధరపైనే ఆశలు..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు ఆశాజన కంగా ఉండడంతో రైతుల్లో హర్షం కనిపిస్తుంది. క్వింటాల్ పత్తికి పెద్దపల్లి, వరంగల్ మార్కెట్లో గరిష్ఠంగా రూ.7,850, జమ్మికుంటలో రూ.7,800 లభించింది. అయితే పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యే నాటికి మార్కెట్‌లో ధరల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఈసారి పొడువుపింజ పత్తి మద్దతు ధర గతేడాదితో పోల్చితే రూ.500 పెంచింది. మండలంలో దిగుబడి అయ్యే పత్తి పొడువుపింజ కావడంతో రైతులకు మరింత మేలు చేకూరే అవకాశం కనిపిస్తుంది. మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారం భమయ్యే నాటికి యంత్రాంగం తగు చర్యలు చేపట్టి రైతులు ధర పరంగా మోసానికి గురికా కుండా చూడాలని అభిప్రాయ పడుతున్నారు. ప్రధానంగా వ్యాపారులంతా బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర ఒక రకంగా ఉంటే మార్కెట్‌లో దాని కంటే రూ.500 తక్కువే ఉంటుంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి, వ్యాపారులు రైతు లను మోసాలకు గురిచేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఈ ఏడాదైనా దీన్ని అరికట్టాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా యంత్రాంగం చర్యలు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. కాగా మండలంలో ఈ ఖరీఫ్‌లో పత్తి పంట 3,120 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. దిగుబడి ఎకరానికి 6క్వింటాళ్ల నుంచి 8క్వింటాళ్లు వస్తుందని అంచనా వేశామని, ప్రస్తుతం మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.



కాళేశ్వరంలో కలుషిత మద్యం కలకలం...

- ఒకరికి అస్వస్థత...

నవతెలంగాణ మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో తెలంగాణ వైన్స్ మద్యం షాప్‌లో ఆదివారం కలుషిత మద్యం కలకలం రేపింది. రేగొండ మండలం చిన్నకోడూపాక గ్రామానికి చెందిన వారు కాళేశ్వరం గోదావరి నదిలో అస్థికల నిమజ్జనం కోసం వచ్చారు. కాళేశ్వరం లోని తెలంగాణ మద్యం షాప్ లో 24 కింగ్ ఫిషర్ అల్ట్రా బీర్ బాటిల్స్ తీసుకోగా అందులో రెండు బాటిల్ లో తెల్లటి గడ్డలాంటి ఉండ ఉండగా చూడకుండా బీర్ తాగిన వ్యక్తి అస్వస్థకు గురయ్యాడు. మిగితా బాటిల్స్ గమనించగా మరో బాటిల్‌లో కలుషిత మద్యం కనిపించింది. ఇదేంటని సదరు షాపు నిర్వాహకులను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేయడానికి ప్రయత్నించారని బాధితులు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోనే మేము ఏం చెప్తే అది నడుస్తుంది నువ్వు ఏ అధికారికి ఫిర్యాదు చేసుకుంటావా చేసుకో అంటూ భయభ్రాంతులకు గురి చేశారని, అక్కడికి మీడియా చేరుకోవడంతో మీడియాపై కూడా దురుసుగా ప్రవర్తించారు. వెంటనే సంబంధిత అధికారులు వైన్ షాప్‌ను తనిఖీ చేసి చట్టపరంగా చర్య తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేయాలని బాధితులు కోరారు.

మినీ ఐటీడీ మాతా శిశు ఆస్పత్రి మంజూరు చేయాలి

కేంద్రమంత్రికి బీజేపీ నాయకుల వినతి

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆదివారం పర్యటించిన కేంద్ర హోమ్ సహాయక మంత్రి బండి సంజయ్‌కి మహాదేవపూర్ మండల కేంద్రం లో మినీ ఐటీడీ గర్భిణి కోసం మాతా శిశు హాస్పిటల్ మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శ్రీధర్, మండల నాయకులు దేవ రావు, ఐలయ్య యాదవ్ శ్రీమన్నారాయణ, అడప లక్ష్మీనారాయణ, సూరం మహేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు. మంత్రి వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణరెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజేందర్ కుటుంబానికి అండగా ఉంటాం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



నవతెలంగాణ-మహదేవపూర్

రాజేందర్ కుటుంబానికి అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన ఇటీవల గుండెపోటుతో మరణించిన రాజేందర్ ఇంటికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. రాజేందర్ మరణం పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మండల కేంద్రంలో మినీ ఐటీడీఏతోపాటు మాతా శిశు కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. అంతకుముందు రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చల్లా నారాయణరెడ్డి, బీజేపీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్ రెడ్డి మండల అధ్యక్షుడు ఆకుల శ్రీధర్, నాయకులు శ్రీమన్నారాయణ, ఐలయ్య యాదవ్, వడప లక్ష్మీనారాయణ, మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అప్పుడే పట్టా చేస్తే ప్రాణాలు పోయేవా..?

15 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం శూన్యం
ప్రాణం మింగారని కుటుంబసభ్యుల రోదన
గ్రామంలో నలుగురు పెద్ద మనుషులే కారణం..
న్యాయం జరిగే వరకు ఊరుకోం..

కొండాపూర్‌లో రోడ్డుపై బైఠాయించిన బాధిత కుటుంబసభ్యులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

15 ఏండ్లుగా తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ వ్యవసాయ భూమిని పట్టా చేయకుండా కాలయాపన చేస్తున్నారని, అప్పుడే పట్టా చేస్తే తన భార్యను కోల్పోయేవాడిని కాదని చిల్పూర్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ బాధితుడు ఆవేదనతో, తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా బాధితుడు కుంచం కార్యవద్దిరాజు విలేకరులతో మాట్లాడారు. తాము కష్టించి పనిచేసి 2011లో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని గ్రామంలోని ఓవ్యక్తి వద్ద కొనుగోలు చేయగా, గ్రామంలో పెద్దమనుషులుగా చెలామణి అవుతున్న నలుగురు వ్యక్తుల జోక్యంతో 15 ఏండ్లు గడుస్తున్నదని, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా, తమకు న్యాయం జరగలేదని, పట్టా చేయడంలో నిర్లక్ష్యం వల్లే తన భార్య జ్ఞానేశ్వరి(45) తన చావుతోనైనా సమస్య తీరుతుందని, పురుగుల మందు తాగి ఈఏడాది జూలై7న ఆత్మహత్యకు పాల్పడిందని, అప్పుడే తాము శవంతో నిరసన తెలుపగా, జూలై చివరి వారంలోపు కొన్న రెండు ఎకరాలకు బదులు మరో ఎకరం మొత్తంగా మూడు ఎకరాలు పట్టా చేసే బాధ్యత తమదేనని చెప్పి పోలీసుల సమక్షంలోనే ఒప్పుకొని, మూడు నెలలు గడుస్తున్నా నేటికీ పట్టా చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాము కష్టపడి చిట్టీలు వేసి, వచ్చిన డబ్బులతో కొనుగోలు చేస్తే, అకారణంగా గ్రామానికి చెందిన నలుగురు మధ్యవర్తుల వల్లనే తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోతుందని ఆరోపించారు. ఆనలుగురు వ్యక్తులపై కేసులు నమోదైనప్పటికీ, చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు నవీన్ కుమార్, వినయ్ కుమార్, పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి, నచ్చజెప్పి రెండు రోజుల్లో ఇరువర్గాలతో మాట్లాడే అవకాశం కల్పిస్తామని చెప్పడంతో బాధితులు అంగీకరించి, నిరసన విరమించడంతో వివాదం సర్దుమణిగింది.

మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా బైరి శ్రీకాంత్

నవతెలంగాణ-తరిగొప్పుల



మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. మండల అధ్యక్షుడిగా బైరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా తాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సొం టెంక కుమార్, కోశాధికారిగా మూల మహేష్‌గౌడ్, సలహా దారుడుగా తిరు మలేశులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు మాట్లాడుతూ తమ పైన నమ్మకంతో ఈబాధ్యతలు అప్పజెప్పినందుకు ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

విద్యాశాఖలో విష వృక్షాలు శీర్షిక పై ఖండన

పీఎస్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్

నవతెలంగాణ- లింగాలఘణపురం



శనివారం ఒక దినపత్రికలో "విద్యా శాఖలో విషవృక్షాలు" అనే శీర్షిక పేరుతో ప్రచురితమైన వార్తను తీవ్రంగా ఖండి స్తున్నట్టు పీఎస్ ప్రధానో పాధ్యాయుల రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి యజేశారు. నీతి నిజాయితీకి మారు పేరుగా నిలిచిన జిల్లా విద్యాధికారిపై అవాస్తవాలు రాస్తూ అక్రమాలకు తావిస్తున్నట్లు నిందించడాన్ని రాష్ట్ర ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నిరంతరం జిల్లాలోని పాఠశాలలను పర్యవేక్షిస్తూ, సామరస్య పూర్వకంగా తగు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులకు అందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్న డీఈవోని అప్రతిష్ట పాలు చేయడాన్ని జిల్లా ఉపాధ్యాయ లోకం జీర్ణించుకోలేక పోతుందన్నారు. వ్యవస్థ అన్నప్పుడు ప్రతి వ్యవస్థలో కొన్ని సంఘటనలు చోటు చేసుకోవడం మామూలే అయినా, ఇలాంటి సమస్యలు తలెత్తిన తక్షణమే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పరిశీలిస్తూ, నివేదకల ఆధారంగా తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి జనగామ జిల్లా విద్యాశాఖ ముందుందనడంలో అతిశయోక్తి లేదు. పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తుల విషయంలో 2023-24 విద్యా సంవత్సరం అవకతవకలు జరిగినట్లు, అందుకు బాధ్యుడైన ఎంఈఓపై నివేదికలిచ్చిన రీజినల్ జాయింట్ డైరెక్టర్ గాని ,స్టేట్ విద్యాశాఖ డైరెక్టర్ కాని సదరు ఎంఈఓ పై చర్యలు తీసుకోవాల్సి ఉండగా డీఈవోపై తప్పుడు ప్రచారం చేయడం అవగాహన రాహిత్యమే అవుతుంది తప్పా మరొకటి కాదన్నారు. తరిగొప్పుల మండలం నుండి డిప్యూటేషన్ ఆన్ ఫారెన్ సర్వీసెస్ లో భాగంగా జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయునికి ఆర్డర్స్ సర్వ్ చేసే అధికారం తిరిగి రిపాట్రియేషన్ చేసే అధికారం గాని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ మాత్రమే ఉంటుంది. దీన్ని రాద్ధాంతం చేస్తూ డీఈవో తప్పు చేసినట్లు వక్ర రాతలు రాయడం ద్వారా మనల్ని మనమే అప్రతిష్ట పాలు చేసుకోవడం తప్ప మరొకటి కాదని రమేష్ పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలో 4వ, స్థానంలో నిలిపి, రేపు నవంబర్ 19న జరగబోయే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాసా) లో జాతీయస్థాయిలో కాంపిటీషన్ ఇవ్వాలని ధృఢ సంకల్పముతో గౌరవ జిల్లా కలెక్టర్ డైరెక్షన్‌లో ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులను మేల్కొలిపి, సమాయత్తం చేస్తున్న జిల్లా విద్యా శాఖాధికారిపై అసత్య ప్రచారాలు చేయడాన్ని ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల మనం సాధించిన ఫలితాల నివేదికలే జనగామ జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమని బుర్ర రమేష్ తెలిపారు.

అశోక్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-లింగాలఘణపురం

యాదగిరి గుట్టలో నెల్లుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని అశోక్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నేత మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటుగా గుర్రం బాలరాజు, అంబాల యాదగిరి, బత్తిని భిక్షపతి, అంబాల సత్యనారాయణ, గుర్రం ప్రవీణ్, నూనెముంతల హేమెందర్, బత్తిని విజయ్ కుమార్, గుర్రం సందీప్, సత్యనారాయణ, అంబల మహేష్, కొత్తకొండా గంగాధర్, అంబల సంపత్ గొరిగే రాజు, గాడిపల్లి రవి, ధమేర ప్రభాకర్, గణగణ ఉమేష్, ఒరుగంటి రాజు తదితరులు ఉన్నారు.



పీవీఆర్ పాఠశాల విద్యార్థులకు బహుమతుల ప్రధానం..

నవతెలంగాణ-లింగాలఘణపురం



శ్రీశ్రీమన్నారాయణ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన మదర్ ల్యాండ్, స్వాతంత్ర సమరయోధుల అంశాలపై పోటీలు నిర్వహి ంచారు. ఈపోటీలలో మండలంలోని వనపర్తి గ్రామ సమీపంలోని పీవీఆర్ స్కూల్ విద్యార్థులకు జిల్లా స్థాయిలో గూడ దీపిక ప్రథమ బహుమతి రూ.6000, లకావత్ శివరాజ్ ద్వితీయ బహు మతి రూ.3 వేల నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా అందుకున్నారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ఎంఏ జనగామ జిల్లా అధ్యక్షుడు లయన్ పప్పు వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలు దేశ ప్రజలకు ప్రమాదకరం



సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు దేశ ప్రజలకు ప్రమాదకరమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పాలకుర్తి మండలంలోని దర్దపల్లి గ్రామ శాఖ మహాసభ మూస్కు ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. మహాసభల ప్రారంభ సూచికంగా సీపీఐ(ఎం) పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో రమేష్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుస రిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు చేస్తుంది సీపీఐ(ఎం) మాత్రమేనన్నారు. సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి అకాల మరణం ప్రపంచ కమ్యూనిస్టు వ్యవస్థకు తీరని లోటన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద విధానాలను అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని ప్రమా దకరంలోకి తీసుకెళుతుందని తెలిపారు. ప్రపంచ దేశాల కమ్యూనిస్టులపై ఎంతో అవినాభావ సంబంధం సీతారం ఏచూరికి మాత్రమే ఉందన్నారు. బిజెపి పాల నతో ప్రమాదంలో ఉన్న దేశానికి సీతారం ఏచూరి మరణం కూడా తీరని లోట న్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రూ.రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని ప్రకటించారని కాని రుణమాఫీ కాని రైతులు చాల మంది ఉన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే పేద ప్రజలకు ఉపయోగపడే చట్టాలు, విధానాలను అమలు చేస్తాయని పేర్కొన్నారు. బిజెపి అమలు కు తెచ్చిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా కొన్ని నెలల పాటు రైతులు ఢిల్లీలో ఆందోళన చేసి విజయం సాధించారని, రైతుల సుదీర్ఘ పోరాటాలు మిగతా సంఘాల వారు ఆదర్శంగా తీసుకొని పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, గ్రామ నాయకులు వేల్పుల కుమార్, వేల్పుల కొమరయ్య, వేల్పుల దామోదర్, తోటరాజు, వేల్పుల సాంబాజి, మోకాటి యుగంధర్, నిమ్మల పెద్దా పురం, గూడ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దర్దపల్లి నూతనశాఖ కార్య దర్శిగా మూస్కు ఇంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు ,పోరాటాలు నిర్వహిస్తానన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ సర్కార్..

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్

నవతెలంగాణ-బచ్చన్నపేట



సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తుందని సీపీఐ(ఎం) జనగామ జిల్లా కమిటీ సభ్యులు సభ్యులు సుంచు విజేందర్ విమర్శించారు. ఆదివారం సీపీఐ(ఎం) నక్కవానిగూడెం గ్రామ శాఖా మహాసభ గొలనుకొండ ఈదమ్మ అధ్యక్షతన జరుగగా ముఖ్యఅతిథిగా సుంచు విజేందర్ పాల్గొన్నారు. మహాసభ ప్రారంభానికి ముందు సీపీఐ(ఎం) జెండాను సిపిఎం నాయకులు బాలరాజు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో విజేందర్ మాట్లాడుతూ స్విస్ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని బయటకి తెచ్చి జనధన్ ఖాతాలలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నల్లధనం రాకపోగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు కుచ్చుటోపి పెట్టి దేశం నుండి అనేకమంది పెద్దలు పారిపోయారని చెప్పారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నా అరికట్టడంలో కేంద్రం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు రాకపోగా పది సంవత్సరాల కాలంలో సుమారు 18 లక్షల ఉద్యోగాలను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను చైతన్యం చేయాలని పార్టీ శ్రేణులకు ఈసందర్భంగా పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు అవుతున్న పేదవాడికి సొంత ఇల్లు లేకపోవడం పేద ప్రజల పట్ల పాలకుల చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతుందన్నారు. ఉండడానికి ఇల్లు లేక, చేసుకోవడానికి చేతినిండా పనులు దొరక్క అద్దె ఇళ్లలో ఉంటూ అనేక అవమానాలు భరిస్తున్నారన్నారు. ప్రతి పౌరుడికి తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట ఉండడానికి ఇల్లు కల్పించాలనే భారత రాజ్యాంగ స్ఫూర్తిని పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటుతున్న పేదోడి సొంతింటి కల గానే మిగిలిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో అతి ముఖ్యమైన గ్యారంటీ సొంత ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఇస్తామన్న హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. రేషన్ కార్డు లేక అనేక మంది కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈమహాసభలో మహిళా శాఖ కార్యదర్శిగా గొలనుకొండ ఈరమ్మ గ్రామ కార్యదర్శిగా, బోడ పట్ల బాలరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల కమిటీ సభ్యులు అన్నబోయిన రాజు తాడెం రాములు, గుండ రవి, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో జరిగిన అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోరు..?



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం

నవతెలంగాణ-జనగామ

ఏకరూప దుస్తుల వ్యవహారం, అక్రమ డిప్యూటేషన్ల విషయంలో జనగామ జిల్లా విద్యాశాఖలో అవకతవకలు జరిగాయని తెలిసినప్పటికీ వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మభిక్షం ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ధర్మభిక్షం పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏకరూప దుస్తుల వ్యవహారం, అక్రమ డిప్యూటేషన్ల విషయంలో గతంలో విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విచారణ జరిపిన ఎలాంటి చర్యలు తీసుకోకుండా మభ్యపెడుతున్నారన్నారు. ప్రభుత్వ విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా అవుతుందన్నారు. విద్యా శాఖలో జరుగుతున్న అవినీతి పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్రమార్కులతో కుమ్మక్కు అవుతున్నారని మండి పడ్డారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన దుస్తుల విషయంలో అవకతవలకు పాల్పడ్డారని, అలాగే డిప్యూటేషన్ల విషయంలో అక్రమాలు జరిగాయన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. వాటి పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో నేటికీ పలు పాఠశాలల్లో టాయిలెట్స్ లేని పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వ విద్యపై దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు విద్యా రంగంపై దృష్టి కేంద్రీకరించి పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలన్నారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే జిల్లా విద్యా శాఖా కార్యాలయం, ఎమ్మెల్యే, ఎంపీల ఇంటి ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు సాగర్, రాజ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచుల్లో ప్రయాణం

త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

నవతెలంగాణ-లింగాలగణపురం



మండలంలోని పటేల్ గూడెం గ్రామ సమీపంలో జనగామ పాలకుర్తి ప్రధాన రహదారి మీద యశ్వంతాపురం వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ప్రయాణికులకు ప్రమాద అంచుల్లో తప్పని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగిపొర్లడంతో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వరద తాకిడికి తెగిపోయింది. దీంతో పాలకుర్తికి వెళ్లే వాహనాలను సూర్యాపేట రోడ్డు నుండి నీళ్లపోగుల చిన్నమడూరు, అప్పిరెడ్డిపల్లి గ్రామాల మీదిగా దారి మళ్లించారు. వర్షాలు తగ్గడంతో సదురు కాంట్రాక్టర్ వాహనాలు వెళ్లేందుకు మళ్లీ తాతకాలిక రోడ్డును సగం బ్రిడ్జిపై నుండి ఏర్పాటు చేశారు. దూరం తిరిగి పోవడం ఎక్కువవడంతో మళ్లీ వాహనాలు ఈ తాత్కాలిక రోడ్డుపైనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయాణికులు త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

శ్రీ దుర్గమ్మ గుడిపై పిడుగు.. అమ్మవారి విగ్రహం ధ్వంసం

నవతెలంగాణ-లింగాలఘణపురం



రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీదుర్గమ్మ గుడి పై పిడుగు పడిన సంఘటన మం డలం లోని నేలపోగులలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం గ్రామంలో గ్రామదేవతయైన దుర్గమ్మ గుడి మీద పిడుగు పడడం జరిగింది. పిడుగు తాకిడికి గుడి శిఖరం పై ఉన్న విగ్రహాలు పగిలిపోయి చేతులు విరిగి పోయి కింద పడిపోవడం జరిగింది. అంతేకాకుండా మీద గోపురం కూడా పగిలి పోయింది. ఇలాంటి విపత్తును గ్రామంలో ఎలాంటి ప్రజానీకానికి నష్టం చేయ కుండా దుర్గామాత తన శక్తితో తన మహిమతో తనపై వేయించుకుందని గ్రామ ప్రజలు గ్రామ దేవతలు మొక్కుతున్నారు. గ్రామ దేవతలు ఊరిని కాపాడారని పలువురు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ..

నవతెలంగాణ -కొడకండ్ల



మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారు సర్పంచ్‌తండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కునుసోతు బాబు నాయక్ భార్య మంగమ్మ అనారోగ్యానికి గురై మృతిచెందగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఇన్‌ఛార్జ ఝాన్సీరెడ్డిల ఆదేశాల మేరకు ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్ ఆమె భౌతిక గాయంపై పూలమాలవేసి నివాళులర్పించి ఆకుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాబునాయక్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడితో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత..

నవతెలంగాణ-లింగాలఘణపురం



మండలంలోని చీటూరు గ్రామానికి చెందిన గడ్డం రామయ్య మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉప్పల మధులు మానవత్వం చాటుకుని గత వారం రోజుల క్రితం ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.40 వేలను గుడి వంశీధర్‌రెడ్డి వైద్యం ఖర్చు మొత్తం పెట్టుకున్నారు . ఆదివారం కూడా దహన సంస్కారాలకు రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పసుల సోమ నరసయ్య, మాజీ ఉప సర్పంచ్ బర్ల గణేష్, వార్డ్ సభ్యులు ఐలేని మల్లారెడ్డి, పసుల శ్రీను, సీనియర్ నాయకులు మల్కాపురం స్వామి, పసుల కిష్టయ్య, గడ్డం. యాకయ్య, కొడిశాల పోషాలు, యువ నాయకులు పసుల ప్రభాకర్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్రా వీరస్వామి నియామకం

నవతెలంగాణ-లింగాలఘణపురం



మండలం లోని కుందారం గ్రామానికి చెందిన చిర్రా వీరస్వామిని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా జనగాం మండలం శామీర్ పేట గ్రామానికి చెందిన గుర్రాల సురేషులను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య(రాజ్యసభ సభ్యులు), బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణలు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు, హైదరాబాద్ లోని బీసీ భవన్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్రా వీరస్వామి కురుమ మాట్లాడుతూ బీసీల హక్కుల, రిజర్వేషన్ల అభివృద్ధి, రాజ్యాధికారంకోసం నిరంతరం పోరాటాలు చేస్తానన్నారు. ఆర్.కృష్ణయ్య, ఎర్ర సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జనగాం జిల్లా అధ్యక్షులు పండుగా హరీష్, మారబోయిన శ్రీనివాస్, నిమ్మాల కుమార్, దామెర సుమన్, ఎ.మైపాల్, పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-పాలకుర్తి

మండలంలోని గూడూరు ఉన్నత పాఠశాలలో ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పూజారి చంద్రుడు, గందె వెంకన్న, ఉల్లి రమాదేవిల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యా బోధన చేసి విద్యార్థిని విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా యత్నించేసిన అప్పటి ఉపాధ్యాయులు సత్యం, గట్టు తిరుమలయ్య, లక్ష్మీనర్సయ్యలను మెమొంటోలను అందజేసి ఘనంగా సన్మానించారు. 38 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలలో కలయికగా సమ్మేళనం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. చదువుకున్న పాఠశాలను ఎన్నటికీ మరువబోమని, ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదిగినప్పుడే చదువుకున్న పాఠశాలతో పాటు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు గౌరవం దక్కుతుందన్నారు.

నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కొడకండ్ల



కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజలు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసేందుకు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

బీఆర్ఎస్ పార్టీ ప్రజారోగ్య త్రిసభ్య కమిటీలో మాజీ ఉప ముఖ్య మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు చోటు దక్కడంతో మర్యాద పూర్వకంగా కలిసేందుకు రఘు నాథపల్లి మాజీ ఎంపీపీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ శ్రేణులతో మర్యాద పూర్వకంగా కలిసేందుకు బయలుదేరారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ముక్క పరశురాములు, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు లోకుంట్ల సృజన్‌కుమార్, నాయకులు ఎడ్ల బాలరాజు, నూనెముంతల యాకస్వామి, దుబ్బాక హరీష్, చింతల బాలకృష్ణ, హేంగే నర్సింగరావు, తాళ్లపల్లి బాలు, కందుకూరి రాజు, గంపల రాములు, ముప్పిడి సాంబ, మరకాల మహేందర్, బాల్నే పరశురాం, ముసిపట్ల రాజు, గంగారపు మురళి, అరుణ్, జిలకర దివాకర్, బండి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి

టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్

నవతెలంగాణ-పాలకుర్తి



ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ లను వెంటనే చెల్లించాలని టీపీ టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు చెల్లిస్తామని ప్రకటించ కపోవడం ఉపాధ్యాయ లోకానికి నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్ డీఏల చెల్లింపుపై దష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ డీఏలను ఉపాధ్యాయులకు చెల్లించాలని కోరారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నర్మెట్ట

ప్రజల ఆరోగ్యాలకు గద్దల కిషోర్ కుమార్ నేతృత్వంలో జరిగే వైద్యశిబిరం గండిరామారం పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలకు మహాజన సోషలిస్టు పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ కుమార్ వారి సతీమణి అరుణ ఆధ్వర్యంలో హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం గండిరామారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు క్యాంపు నిర్వహిస్తున్నామని, ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంఎస్‌పీజనగామ జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. ఈసదావకాశాన్ని గండి రామారం ప్రజలు, పరిసర ప్రాంతాల గ్రామాలు, నర్మెట్ట మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వినియోగించుకోవాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న

నవతెలంగాణ -మరిపెడ




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు తిప్పికొట్టాలని, కార్మిక సంక్షేమం కోసం ప్రతి మండల కేంద్రంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గాలివారి గూడెం గ్రామంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ ఆఫ్ యూనియన్ (బీసీ డబ్ల్యూ ఎఫ్ -సీఐటీయూ) గ్రామ జనరల్ బాడీ సమావేశం జరిగింది ఈసమావేశానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న, జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్యలు హాజరయ్యారు. ఈసందర్భంగా వీరన్న మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలు కార్మిక సంక్షేమం కోసం ఏర్పడ్డ నిధులని కేంద్ర ప్రభుత్వం దారిమళ్లించిందని ఆరోపించారు. సివిల్ సప్లై కార్మికులకు, ఆయుస్మాన్ భారత్ హెల్త్ చెకప్ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. కార్మిక శాఖ బోర్డు నుండి కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకోక వాళ్లకు నిధులు ఇవ్వకుండా మధ్యలో ఇశ్రం కార్డు పెట్టి కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో 23న జరిగే చలో హైదరాబాద్‌కు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని వీరన్న పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి పసుపులేటి యాదగిరి, మండల ఉపాధ్యక్షులు బుష్పాక ముత్తయ్య, ఎడెల్లి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు బెల్లం పాపయ్య, మాజీ సర్పంచ్ ఎడెల్లి రామయ్య వెంకన్న, చంద్రశేఖర్, భద్రయ్య రమేష్, మహేష్, శ్రీను, ఉప్పలయ్య, వెంకన్న, నరసయ్య, హుస్సేన్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో మట్టి రోడ్లు

వార్డులలో బురద రోడ్లు

నడవలేకపోతున్న ప్రజలు





నవతెలంగాణ-మరిపెడ

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊసిపోయిన చందంగా మరిపెడ మున్సిపాలిటీ రోడ్లు ఉన్నాయని పలువురు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 16వ తేదీన అన్ని వార్డులలో ఒకేసారి పోసిన మట్టి రోడ్లకు అవినీతి మరకలు అంటున్నట్లు తెలుస్తుంది. దీంతో పోసిన మట్టి మంచి మట్టి కాదు. బంకమట్టి పోయడంతో మొన్న కురిసిన వర్షానికి బురద మయంగా ఉన్నాయి. ఇందులో మహిళలు వృద్ధులు చిన్నపిల్లలు నడవలేని పరిస్థితి ఉందని స్థానికులు తెలిపారు. పోసిన మట్టి మొరం మట్టి పోయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒక్కొక్క వార్డుకు లక్ష రూపాయలు ఖర్చు చేసి మట్టి పోసినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాసిరకమైన పనులపై మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని, అధికారుల పర్యవేక్షణ కరువైందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేగాక పారిశుద్ధ్యం ఎక్కడికక్కడ పేరిగిపోయిందని, మురికి కాలువలో ఉన్న మట్టిని మొత్తం బయటికి తీయక కాలువలు అన్ని పూడిపోయినట్లు ఇందిరా నగర్ కాలనీ ప్రజలు తెలిపారు. దారం రామయ్య ఇంటిపక్కనుండి కునియ తండాకు వెళ్లే మురికి కాలువలు పూడిక పూర్తిగా తీయడం లేదని స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్ సందు బజార్, రాజు ఆస్పటల్ నుండి లోక్యాతండాకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలువలు మట్టితో కూరుకుపోయినట్లు దీంతో కాలువల నీరు రోడ్ల మీదికి పొర్లుతున్నాయని స్థానికులు తెలిపారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్నా నామాత్రపు పనులే ఉన్నాయని, పూర్తిస్థాయిలో పరిరక్షణ లేక పనులలో నాణ్యత ఉండటం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా వార్డులలో పర్యటించి సమస్యలను గుర్తించాలని, వాటిని పరిష్కరించాలని కోరుతున్నారు.

కాళోజీ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మహబూబాబాద్

కాళోజి వాకర్స్ అసోసియేషన్ మహబూబాబాద్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు, మహబూబాబాద్ జనరల్ బాడీ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కాళోజి వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, మైస శ్రీనివాస్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. నూతనంగా ఏర్పడబోయే కమిటీ కాళోజి స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులుగా మైస నాగయ్య, మైస శ్రీనివాస్, అధ్యక్షులుగా నామిరెడ్డి వెంకటరెడ్డి, సహాధ్యక్షులు తోడేటి వెంకన్న, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, సమన్వయకర్త మందాటి మధుసూదన్ రావు, గౌరవ సలహాదారులుగా గూడూరు నాగేశ్వర్‌రావు, కునుసోతు హట్యానాయక్, పెద్ది వెంకన్న కోట సుధాకర్, ఆరుట్ల పరమాత్మ చారి, ఉపాధ్యక్షులుగా జర్పుల వీరన్న, శ్యామల శ్రీనివాస్ రెడ్డి, బోర్ల ప్రభాకర్, హేమన్ రెడ్డి, గోనే శ్యామ్‌రావు, కార్యదర్శులుగా కుర్ర మహేష్, దేవుడి మధుసూదన్ రెడ్డి, మేడ వెంకట్, తోడెం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా మద్దెర్ల రాజన్న, నలమాస విక్రం, పులి దామోదర్, నిర్వహణ కార్యదర్శులుగా బొప్పిడి శ్రీనివాసరెడ్డి, లింగాల సాగర్, కిషన్ నాయక్, ప్రచార కార్యదర్శులుగా రాచకొండ ఉపేందర్, వేముల రవీందర్‌లు ఎన్నికయ్యారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-పెద్దవంగర:

నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంట్లకుంట, పోచంపల్లి, ఉప్పెరగూడెం, పెద్దవంగర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇటీవల కాలంలో వేర్వేరు కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, ఆపదలో వారికి అన్ని విధాల తోడుగా ఉంటామని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగు మురళి గౌడ్, విజయ్ పాల్ రెడ్డి, దాసరి శ్రీనివాస్, బానోత్ సీతారాం నాయక్, ఓరుగంటి సతీష్, బీసు హరికృష్ణ గౌడ్, బానోత్ వెంకన్న, రవీందర్ రెడ్డి, గద్దల ఉప్పలయ్య, మహిళా అధ్యక్షురాలు చిలుక దేవేంద్ర, బెడద మంజూల, లింగమూర్తి, జాటోత్ వెంకన్న, ఆవుల మహేష్, సుంకరి అంజయ్య అనపురం చంద్రమౌళి, చిలుక సంపత్, ధర్మారపు వెంకన్న, రాంపాక అనిల్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.



యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: ఎస్సై ఉపేందర్

నవతెలంగాణ-తొర్రూరు



సమాజంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తొర్రూరు ఎస్సై ఉపేందర్ అన్నారు. పట్టణ కేంద్రంలో ఆదివారం సమత జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ను అవసరం మేరకే వాడాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మంచి విలువలు పెంపొందించుకొని భవిష్యత్తులో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సమత ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.యాదగిరిరెడ్డి మాట్లాడుతూ మంచిగా చదువుకొని మంచి భవిష్యత్తు పొందాలన్నారు. కళాశాల కళాస్పాండెంట్, సెక్రెటరీ కోట రఘునాథ రెడ్డి మాట్లాడుతూ సమత ఎడ్యుకేషనల్ సొసైటీకి ఈ ప్రాంతంలో మంచి బ్రాండ్ ఉందని, కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా మంచి విద్యను అందిస్తున్న విద్యా కేంద్రంగా పేరు సంపాదించుకుందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామ్‌రెడ్డి, సమత డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు వెంకన్న, రవీందర్, లోకుంట్ల వీరన్న, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అర్హత ఉన్నా.. అందని పథకాలు..!

దరఖాస్తుదారుల కష్టాలు తీరేదెలా..?

ప్రజాపాలన దరఖాస్తు నింపడంలో అవగాహన లేమి..

చెప్పులు అరిగేలా తిరుగుతున్న లబ్ధిదారులు

తల పట్టుకుంటున్న అధికారులు..

ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్‌లో సవరించాలని వేడుకోలు ..

నవతెలంగాణ -మరిపెడ



నిరుపేదలకు నిష్పక్షపాతంగా పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో నూతన దరఖాస్తులను అన్ని గ్రామాల్లో ప్రజలకు అందించడం జరిగింది. అందులో భాగంగానే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువచేసే క్రమంలో ప్రజాపాలన దరఖాస్తులను నింపి కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారుల ద్వారా స్వీకరించారు. దరఖాస్తులో లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి చేకూరాల్సిన పథకాలకు సంబంధించి అంశాలను అందులో పొందుపరిచి నిబంధనకు అనుగుణంగా దరఖాస్తును నింపాల్సిందిగా అధికారులకు సూచించారు. కాని ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో కొంతమంది దరఖాస్తు నింపే క్రమంలో తప్పులు దొరికాయి. దీంతో ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందని ద్రాక్షలా ఉన్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మండలంలో 44 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో రోజు ఐదారు గ్రామాల నుండి మండల కేంద్రానికి సంక్షేమ పథకాలు అందటం లేదని ప్రజాపాలన దరఖాస్తులు తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ఎవరిని అడుగాలో ఏం చెప్పాలో తెలియక ప్రజలు తికమకపడుతూ ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో కౌంటర్లు పెట్టినా లబ్ధిదారులకు సరైన సమాధానం చెప్పకుండా అధికారులు అగ్రహిస్తున్నారని పలువురు, పలు గ్రామాలకు చెందిన మహిళలు, వద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులో తప్పులు రాయటం వల్ల ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతాయని భయంతో వారు ఆవేదన చెందుతున్నారు. ఈమేరకు ఆనేపురం గ్రామంలో గాడిదల మల్లేశంకు కరెంట్ బిల్లు సబ్సిడీ రావడం లేదని కార్యాలయం బయట కూర్చొని దిక్కులు చూస్తున్నారు. ఏం కావాలని "నవతెలంగాణ" పలకరించగా తన బాధను ఆయన పంచుకున్నారు. అట్లాగే అబ్బాయి పాలెం, బోడామతండా, గుండెపూడి, నిలుకుర్తి, ఆనేపురం, తదితర గ్రామాల నుండి లబ్ధిదారులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పనులు కావడం లేదని వారు వాపోయారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా ప్రజాపాలనలో పరిష్కారం లభిస్తుందనే ఆలోచనతో పెట్టిన మంచి పథకాలు ప్రజలకు దక్కకుండా పోవడం దురదష్టకరం.. నానాటికి పెరుగుతున్న ధరల ప్రభావం పేద ప్రజలపై పడరాదన్న సంకల్పంతో మహాలక్ష్మి పథకం కింద కేవలం రూ.500లకే వంట గ్యాస్ సరఫరా చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది ఈపథకం అమలుకు జిల్లాకు ప్రభుత్వం రూ.4.26 కోట్ల సబ్సిడీ ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయినా ఇంకా అనేక గ్రామాలలో ఆన్‌లైన్‌లో జరిగిన తప్పుల వల్ల అర్హులైన పేదలకు పథకాలు అందకుండా పోతున్నాయని విస్తతంగా చర్చ జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మరోసారి ఆన్‌లైన్‌లో జరిగిన తప్పిదాలను సవరించుకోవడానికి మరో అవకాశం ఇవ్వాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నెలకు రూ.800 కరెంట్ బిల్లు వస్తుంది..

తేజావత్ శారద, వ్యవసాయ కూలీ, బోడ అమతండా



నేను కూలి చేస్తే వచ్చేది రూ.200 ఈనెల కరెంటు బిల్లు రూ.ఎనిమిది వందలు వచ్చిందని వ్యవసాయ కూలీ తేజావత్ శారద ఒంటరి మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో నా భర్త మతి చెందారు.నాకు ఒక కూతురు ఆమె అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుంది. ఆమెకు మెడికల్ బిల్లు రూ.2 వేలు ఖర్చవుతుందని ఆమె గోడును వెళ్ల బుచ్చారు. ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులు తప్పులు దొరికాయి. దీంతోనాకు 200 విద్యుత్ సబ్సిడీ రావడం లేదని వాపోయింది. కరెంటు ఆఫీస్‌కు వెళితే ఎంపీడీవో ఆఫీసుకు వెళ్ళమన్నారు. అక్కడికి వెళితే వచ్చే ప్రజాపాలనలో మళ్లీదరఖాస్తు చేసుకోవాలని అధికారులు సలహాలు ఇచ్చారని ఆమె "నవ తెలంగాణ"కు తెలిపారు. గహజ్యోతి పథకం ద్వారా నాకు విద్యుత్తు సబ్సిడీ వచ్చే విధంగా చూడాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

ఆసరా పెన్షన్ అందడం లేదు..

దుబాకుల లాలు, ఊరుపక్కతండా, గుండెపుడి



కెసిఆర్ పాలనలో నాకు వయసు లేదని ఆసరా పింఛన్ ఇవ్వలేదని , రేవంత్ రెడ్డి పాలనలో ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్నా ఆసరా పెన్షన్ రావటం లేదని 69 ఏళ్ల వద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు. నాకు పెన్షన్ మంజూరు చేయాలని ఎంపీడీవో కార్యాలయం చుట్టూ గత కొన్ని రోజుల నుండి తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదని ఆయన "నవ తెలంగాణ"కు ఆవేదన వ్యక్తం చేశారు. నాకు పింఛన్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

దుండి వీరన్న, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి



ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందే విధంగా చూడాలని సీపీఐ (ఎం) మండల కార్యదర్శి దుండి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను నింపిన సందర్భంలో అవగాహన లేక కొంతమంది ఖాళీగా వదిలేయాలని, దీంతో ఆన్‌లైన్ ఎంటర్ చేయ కుండా ఖాళీగా ఉంచడంతో వాటిని సవరిం చుకోవడానికి ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదని లబ్ధిదారులు తమ దష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీని ఫలితంగా గహ జ్యోతి పథకంలో 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సబ్సిడీ, వాటిని కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చి అర్హులైన లబ్ధిదారులకు పథకాలు చేకూరే విధంగా చూడాలని కోరారు.

పట్టణ సమస్యలపై ప్రజా పోరాటాలు..



సీపీఐ(ఎం) 9వ మహాసభలో

జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాలవీరయ్య

నవతెలంగాణ -మరిపెడ

మరిపెడ పట్టణంలో పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ అల్వాల వీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మరిపెడ పట్టణం కేంద్రంలోని స్థానిక ఇందిరానగర్‌లో సీపీఐ(ఎం) పట్టణ 9వ మహాసభ జరిగింది. ఈమహాసభకు ముఖ్యఅతిథిగా అలవాల వీరయ్య, మండల కార్యదర్శి దుండి వీరన్నలు పాల్గొన్నారు. ఇందిరానగర్‌లోని అరుణ ప్రతాకాన్ని ఎగరవేసి మహాసభను ప్రారంభించారు. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ 2017లో మేజర్ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఏర్పడిన మరిపెడ పట్టణం పెద్దగా పురోగతి సాధించింది ఏమీ లేదని వీరయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధులు ఆయా శాఖల నుండి సమగ్రంగా ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. మైనార్టీ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరానగర్ కాలనీ, సేవా నగర్, మరిపెడ విలేజ్ లాంటి ప్రాంతంలో అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. గిరిజన తండాలలో ఎక్కడి సమస్యలు అక్కడనే ఉన్నాయన్నారు. అక్కడ అభివృద్ధి చేయకపోగా ప్రజలపై పన్నుల భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కాని ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. పట్టణంలో జరిగిన కొన్ని అభివద్ధి పనులు పూర్తి కాక పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై అన్ని వార్డులలో సమగ్రంగా సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ప్రజా పోరాటాలు నిర్వహించనున్నట్లు వీరయ్య తెలిపారు. అంతేగాక అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, కార్డులు లేని వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని. ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ఈ మాహాసభలో తీర్మానించారు. ఈసమావేశంలో సీపీఐ(ఎం) మండల నాయకులు బాణాల రాజన్న, గుండగాని మధుసూదన్, పాల్వాయి దుర్గయ్య, పట్టణ నాయకులు తాటికొండ అనంతచారి, బాణాల ఎల్లయ్య, అలవాల మస్తాన్, దొంతు సోమన్న, బాణాల శైలజ, దొంతు మమత, పాల్వాయి ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టౌన్ శాఖ కార్యదర్శిగా దొంతు సోమన్న ఎన్నిక

మహబూబాద్ జిల్లా మరిపెడ (బంగ్లా) సీపీఐ(ఎం) టౌన్ శాఖ కార్యదర్శిగా దొంతు సోమన్న నూతనంగా ఎన్నికయ్యారు. 2009 నుండి పార్టీ సభ్యుడిగా అనేక ప్రజా పోరాటాలను పాల్గొంటున్న దొంతు సోమన్న నూతనంగా ఏర్పడిన కమిటీ కార్యదర్శిగాఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో నూతన కమిటీని నియమించింది. కమిటీ సభ్యులుగా పాల్వాయి దుర్గయ్య, తాటికొండ అనంతచారి, దొంతు మమత, బాణాల ఎల్లయ్య, శైలజ, అలవాల మస్తాన్, పాల్వాయి ఎల్లమ్మ, భూక్యా చంద్రునాయక్, అలవాల ఏకమ్మ, పాల్వా ఎల్లమ్మలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి

నవతెలంగాణ-గార్ల:



వరి పంట పొలంలో పురుగుల మందు పిచికారి చేసేందుకు కూలీకి వెళ్ళి యువకుడు మృతి చెందిన విషాద సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పుమ్యా తండా కు చెందిన గుగులోత్ నితిన్ (20) గార్లకు చెందిన శ్రీనివాస్ అనే రైతు పొలంలో పురుగుల మందులు పిచికారి చేస్తుండగా శనివారం రాత్రి కురిసిన వర్షం గాలి దుమారానికి తెగిపడిన విద్యుత్ తీగను గమ నించకపోవడంతో కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై జీనత్ కుమార్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చేతికి అందిన కుమారుడు విద్యుత్ షాక్ తో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఏడుస్తూ విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం..

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే యువకుడు విద్యుత్ షాక్‌కు బలి అయ్యారని పలు రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో విద్యుత్ తీగ తెగిపడడంతో ఓ రైతుకు చెందిన పాడి గేదె గడ్డి మేసేందుకు వెళ్లి విద్యుత్ షాక్ కు గురై మరణించిందని స్థానికులు తెలిపారు. కాగా శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి తెగిపోయిన విద్యుత్ తీగను విద్యుత్ అధికారులు గమనించకపోవడం వలన విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా యువకుడి నిండు ప్రాణం బలైందని పలువురు విచారం వ్యక్తం చేశారు. ఈప్రమాదంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బంధువులు, వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నారు.

యువకుడి కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్

పొట్ట కూటి కోసం వరి పొలంలో పురుగుల మందు పిచికారి చేసేందుకు కూలీకి వెళ్లి పొలంలో తెగిపడి విద్యుత్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయిన యువకుడు గుగులోత్ నితిన్ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పేద గిరిజన కుటుంబానికి చెందిన నితిన్ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగి పడి చనిపోవడం విచారకరమని, నితిన్ కుటుంబానికి సంతాప సానుభూతిని తెలిపారు. మృతుడు నితిన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సీపీఐ(ఎం) తొర్రూర్ పట్టణ మహాసభలో

జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్

నవతెలంగాణ-తొర్రూరు



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం తొర్రూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహాసభల సూచికగా పార్టీ జెండాను పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో పట్టణ మహాసభ కొమ్మనబోయిన యాకయ్య, బొల్లం మమత ల అధ్యక్షతన నిర్వహించారు. ఈమహాసభకు ముఖ్యఅతిథిగా బొల్లం అశోక్ హాజరై మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేసారని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబాబాద్ జిల్లా పర్యటనలో హైడ్రాను జిల్లా కేంద్రాలకు మండలాలకు విస్తరింపచేస్తామని అనడం హర్షనీయమన్నారు. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికై సీపీఐ(ఎం) పార్టీ అన్నివేళలా పోరాటం చేస్తుందన్నారు. అనంతరం పట్టణంలోని రెండు శాఖలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మొదటి శాఖ కార్యదర్శిగా జమ్ముల శ్రీనివాస్, రెండవ శాఖ కార్యదర్శిగా బొల్లం మమతలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల కార్యదర్శి ఎండీ.యాకూబ్ ప్రకటించారు. ఈసమావేశంలో సీపీఐ(ఎం) తొర్రూరు మండల కార్యదర్శి ఎండి యాకూబ్, మండల నాయకులు మర్క సాంబయ్య, దొనుక దర్గయ్య ఉమ్మగాని యాకయ్య, దొమ్మటి సోమయ్య, పొడగంటి ఎల్లమ్మ, పల్లె వెంకటేశ్వర్లు, జిగిజర్ల శ్రీను, యనమల క్రాంతి కుమార్, కిన్నెర నగేష్, రామకృష్ణ, నవీన్ బాబు, ప్రమీల, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల ధరలు పెంచింది బీజేపీనే..

సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి

నవతెలంగాణ-మహబూబాబాద్

బిజెపి అధికారంలోకి వచ్చిన ఈదశాబ్ద కాలంలో నిత్యవసర సరుకులు విపరీతంగా పెరిగాయని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి విమర్శించారు. ఆదివారం గిరి ప్రసాద్ నగర్ శాఖా మహాసభ మారోజు పుష్పలీల మురళి చారి ప్రాంగణంలో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా జిల్లా కమిటీని సభ్యులు సమ్మెట రాజమౌళి పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. సభ్యులు రాజమౌళి మాట్లాడుతూ దేశంలో మూడోసారి బిజెపి అధికారంలోకి వచ్చింది కాని పేదోడు తినే నిత్యావసర ధరలు తగ్గించకపోగా భారీగా పెంచిందన్నారు. సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చీపిరి యాకన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. లేనిఎడల ప్రజలను సమీకరణించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) కార్యదర్శి వరుగ్గా సభ్యులు ధరవాత హేమానాయక్ మాట్లాడుతూ స్థానిక సమస్యల మీద పార్టీ సభ్యులు అందరు కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ గిరిప్రసాద్ శాఖ కార్యదర్శిగా నల్లమస వెంకన్నను ఎన్నుకున్నారు.

గోడ కూలి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-పెద్దవంగర:



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోడ కూలి ఓ వృద్ధురాలు మతి చెందిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన బెల్లంకొండ భద్రమ్మ (55) ఉదయం ఇంటి పనులు చేసుకుంటున్న క్రమంలో ఇంటి గోడ వృద్ధురాలి పై కూలింది. దీంతో భద్రమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. వృద్ధురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. అప్పటి వరకు ఇంటి పనులు చేసుకుంటున్న వృద్ధురాలు ప్రమాదవశాత్తు గోడ కూలి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి వృద్ధురాలి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఉపాధ్యక్షుడు రంగు మురళి, ఈరెంటి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసు హరికృష్ణ గౌడ్, ఎరుకలి సమ్మయ్య చెరుకు సత్యం, బానోత్ రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలో ఒరిస్సా కార్మికుడు మృతి

నవతెలంగాణ-ఇనుగుర్తి



విద్యుత్ ఘాతంతో ఒరిస్సా కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని చిన్ననాగారం శివారు మీర్య తండా పరిధిలోని రత్నశిల గ్రానైట్ క్వారీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఒరిస్సాకు చెందిన యువకుడు మోహిత్ దుర్గ (19) కార్మికుడు గత కొంతకాలంగా క్వారీలో లేబర్ వృత్తి చేస్తున్నాడు. గ్రానైట్ లో శనివారం రాత్రి విధులు చేస్తున్న మోహిత్ దుర్గ ఆదివారం ఉదయం కనిపించకపోవడంతో తోటి కార్మికులు వెతకగా గుంతలో పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మోహిత్ దుర్గ అనే వ్యక్తి రత్నశిల గ్రానైట్ క్వారీలో విధులు చేస్తుండగా విద్యుత్ ఘాతంతో మృతి చెందినట్లు తెలిపారు.

6

నవతెలంగాణ

వరంగల్-ములుగు

సోమవారం సెప్టెంబర్ 23, 2024 www.navatelangana.com

రజక సంఘం మండల అధ్యక్షుడిగా మహేందర్

నవతెలంగాణ-ములుగు



రజక సంఘం ములుగు మండల అధ్యక్షుడిగా ఎన్నిండ్ల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో రజక సంఘం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ములుగు మండల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ములుగు మండల కమిటీని ఎన్నుకోగా మండల అధ్యక్షుడుగా ఎన్నిండ్ల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గూడెల్లి ఓదెలు, మామిడాల బిక్షపతి, రాయ కంటి కుమారస్వామి, రావుల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొమురాజు వెంకన్న, కత్తెరపల్లి సంపత్, కార్యదర్శులుగా పైడిపల్లి కుమారస్వామి, కాసర్ల సారయ్య, కోశాధికారిగా కొత్తపల్లి దయాకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా సమన్వయ కమిటీ సభ్యులకు కతజ్ఞతలు తెలిపారు. వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సంఘం బలోపేతానికి కషి చేస్తానని తెలిపారు.

గుత్తికోయలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-ములుగు



లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ వివేకానందపురం, వరంగల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో లయన్స్ ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్జీ చొరవతో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసి) వారు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా వెచ్చించిన నిధులతో ములుగు జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంత గుత్తికోయ ఆదివాసులకు లక్ష్మీదేవిపేట గ్రామంలో ఆదివారం నాలుగు వందల దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీపీసీ మానవ వనరుల జనరల్ మేనేజర్ ఎస్ ఎన్ పాణిగ్రాహి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారి సహకారంతో ములుగు, అసిఫాబాద్ జిల్లాలలోని నిరుపేద ఆదివాసీలకు రాబోయే చలికాల తీవ్రతను దష్టిలో ఉంచుకుని తమ సంస్థ తరఫున సామాజిక బాధ్యతగా రెండు వేల దుప్పట్ల పంపిణీ చేపట్టామని, రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలలో కూడా విస్తరించి ఉన్న లయన్స్‌క్లబ్‌లు సహకరిస్తున్నాయని లయన్స్ వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఏరియా లీడర్ లయన్ దీపక్ భట్టాచార్జీ మాట్లాడుతూ తమ క్లబ్ సభ్యుడైన పింగిలి నాగరాజు ములుగు ప్రాంతవాసి కావడంతో గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో పన్నెండు వందలకు పైగా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. గతంలో కొండాయి, ఏటూరునాగారం, శనిగకుంట ప్రాంతాలలో వరదలు, అగ్ని ప్రమాదాలు జరుగగా సామగ్రి పంపిణీ చేయడ, ఏటూరునాగారం కొమురంభీంనగర్ ఆడివాసీలకు ప్రత్యేకంగా ఒక లయన్స్ విద్యాకేంద్రం నడుపుతూ ములుగు జిల్లాలో తమ వివేకానందపురం క్లబ్ సేవలు అందిస్తున్న విషయం తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ పింగిలి నాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించడంలో ఎంతగానో సహకరించిన ములుగు డీఎస్పీ రవీందర్ కి, సీఐ శంకర్ కి, వెంకటాపూర్ ఎస్ఐ సతీష్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సికింద్రాబాద్, వరంగల్ నుండి వచ్చిన సుమారు 35మంది లయన్స్ సభ్యులు, ఎన్టీపీసీ సీనియర్ మేనేజర్ గౌతమ్ సింగ్ భాటి ఉత్సాహంగా పాల్గొని వెంకటాపూర్ పరిధిలోని ఆరు గుత్తికోయ ఆవాస ఆదివాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రోసిడింగ్‌పై పునరాలోచన చేయాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు హాట్కర్ సమ్మయ్య

నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుండి విడుదలైన వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రోసిడింగ్‌పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హాట్కర్ సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజులు ఆదివారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా బలోపేతం కోసం మా ప్రభుత్వం అన్ని విధాల కషి చేస్తుందని ప్రభుత్వం చెబుతూనే అశాస్త్రీయంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ ఉన్నచోట పిల్లలు తక్కువ ఉన్నారని దీనిని సర్దుబాటు చేయాలనే పేరుతో విద్యాశాఖ జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన ఆదేశాలు అసంబద్ధంగా ఉన్నాయని ఉన్న విద్యార్థులను కూడా వెళ్లిపోయేలా బడులను మూసివేతకు దోహదం చేసేలా ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించాలని అన్నారు.ప్రథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదేవిధంగా 60మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని అసంబద్ధమైన ఆ శాస్త్రీయ మైన సర్దుబాటు ప్రక్రియ అని అన్నారు. ఈ నియనిబంధనలు యధావిధిగా అమలు చేస్తే ఉన్నత పాఠశాలలోనూ ఉపాధ్యాయునిపై మోయలేని భారం పడుతుందన్నారు.అసంబ ద్ధంగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయినా ఎస్జిటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని,పాత పాఠశాలలో పనిచేయడం ఎంతవరకు సమంజసము ఉపాధ్యాయ బదిలీల రిలీవ్, వర్క్ అడ్జస్ట్మెంట్ వెంటనే స్పందించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించాలి

టీపీటీ ఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

నవతెలంగాణ-వరంగల్





ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట టీచర్లు తక్కువగా, టీచర్లు ఎక్కువగా ఉన్న చోట పిల్లలు తక్కువగా ఉన్నారని దీనిని సర్దు బాటు చేయాలనే పేరుతో విద్యాశాఖ జిల్లా కలె క్టర్లకు ఇచ్చిన ఆదేశాలు అసంబద్ధంగా ఉన్నా యని, ఉన్న విద్యార్థులు కూడా వెళ్లిపోయేలా చేసి బడుల మూసివేతకు దోహదం చేసేలా ఉన్న ఆ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు.టీపీటీఎఫ్ ఖిలా వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ పూర్ణ చందర్ అధ్యక్షతన హన్మకొండ లో జరిగిన వరంగల్, ఖిలావరంగల్ మండలాల సంయుక్త సమావేశం లో ముఖ్య అతిథిగా హాజరై సమా వేశంలో భోగేశ్వర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 11 మంది పిల్లలున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది ఉన్న చోట కూడా ఇద్దరే ఉపాధ్యాయులను ఉంచాలని ఆదేశించడం ఎంత అసంబద్ధంగా ఉందొ విద్యా శాఖ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. ఐదు తరగతు లకు పద్దెనిమిది సబ్జెక్టులను ఇద్దరు ఉపాధ్యాయు లు ఏ విధంగా బోధిస్తారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను పూర్తిగా దూరం చేసేలా ఈ నిబంధనలు ఉన్నాయని అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 40మంది పిల్లలు దాటితే ముగ్గురు టీచర్లను ఇచ్చి ఇప్పుడు తీయడం ఎందుకో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచే శారు. ఎనిమిదేళ్ల క్రితం రూపొందించిన కాలం చెల్లిన నిబంధనలనే ఇప్పటికీ అమలు చేయజూ డడం సరికాదని అన్నారు. ఈ నిబంధనలు యధావిధిగా అమలు చేస్తే ఉన్నత పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులపై మోయలేని భారం పడుతుం దని, ఇది విద్యా ప్రమాణాలపై, ఫలితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. అసంబద్ధంగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. మూసివేసిన బడులను తెరిపిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉన్న బడులను మూసివేసే విధానాలను అమలు చేస్తున్నారని, చెప్తున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతన ఉండాలని ఉపాధ్యాయులు భావిస్తున్నారని అన్నారు.ఈ సమావేశం లో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల .వెంకటేశ్వర్లు,పూజారి మనోజ్,ఉపాధ్యక్షులు జె.స్వామి,జిల్లా నాయకులు వెంకట్. ,బుచ్చాచారి ,పూర్వ ఉపాధ్యాయ సంపాదకులు, బైరి స్వామి, పూర్వ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్,ముజాయిద్ ఆలీ, కె.ఉమేష్ ,హరిప్రసాద్, జహీరోద్దిన్, వేణు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల నూతన కమిటీ

నవతెలంగాణ-గోవిందరావుపేట

పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా కణతల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పాడియా తులసీరామ్‌తో పాటుకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి తులసీరామ్ మాట్లాడుతూ 2022 నుండి 24 వరకు ప్రధాన కార్యదర్శిగా మండల మహాసభ లో నివేదిక ఇవ్వడం జరిగిందని అన్నారు. రెండోసారి ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు జిల్లా, రాష్ట్ర నాయకులకు ఆయన పేరుపేరునా కతజ్ఞతలు తెలిపారు. పిఆర్‌టియు అభివద్ధికి నిరంతరం కషి చేస్తానని ఉపాధ్యాయ సమస్యల పరిష్కార సాధనలో పీఆర్టియు ఎప్పుడు ముందుంటుందని అన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ ఆదాలాత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కమలాకర్ మండల ప్రజలకు సూచించారు. ములుగు జిల్లా న్యాయ సేవధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28 వరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ వీలును బట్టి తమ తమ కేసులను రాజీ కుదుర్చుకునేలా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రాజీ పడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో నెంబర్ వన్ స్థానంలో ఉండాలి

కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్

నవతెలంగాణ-ములుగు



బీజేపీ సభ్యత్వం నమోదులో ములుగు, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో నెంబర్ 1స్థానంలో వుండాలని, తెలంగాణ ప్రజలు బిజేపి వైపు చూస్తున్నారని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తెలిపారు. భారతీయ జనతాపార్టీ ములుగు జిల్లా సభ్యత్వ నమోదు సమావేశం ములుగు, జయశంకర్ (భూపాలపల్లి) జిల్లాల సమావేశం ఎంఆర్ ఫంక్షన్ హాల్ ఇంచెర్లలో ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, భూపాలపల్లి అధ్యక్షుడు నిషిధర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ హాజంయ్యారు. సభ్యత్వ నమోదును బూత్ స్థాయిలో తీసుకెళ్లి వేగవంతం చేసి సభ్యత్వాల నమోదు సేకరించాలని సభ్యత్వ నమోదు ఒక వేడుక లాగా ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వాలు సేకరించాలని కోరాఉ. ప్రతి బూత్‌లో కనీసం 200 సభ్యత్వాలు విధిగా సేకరించి ములుగు, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో నెంబర్ 1స్థానంలో వుండాలని ప్రతి నాయకుడు తమ బూత్‌లో సభ్యత్వం సేకరించాలని, నరేంద్రమోడీ ఫధకాలు జన్‌ధన్ యోజన,పిమ్ కిసాన్ ,అనేక సంక్షేమ పథకాలను వివరిస్తూ మోడీ కుటుంబ సభ్యులుగా చేరాలని ఇంటింటా సభ్యత్వం చేయాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు రాష్ట్ర సహ ప్రముఖ్ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు,అజ్మీరా సీతారాం నాయక్ మాజీ ఎంపీ,ఆరూరి రమేశ్ మాజీ ఎమ్మెల్యే,గోలి మధుసూదన్ కెవిఎల్ఎన్ రాజు జిల్లా సభ్యత్వ ప్రభారి, రాజవర్దన్‌రెడ్డి, చింతలపూడి భాస్కర్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ మండల లవణ్ జన్నుమొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

రూ.21600 విలువ గల ఆభరణాల అపహరణ

నవతెలంగాణ-గీసుగొండ

వరంగల్ మహానగర పరిధిలోని 16 డివిజన్ గొర్రెకుంట కట్టమల్లన్న దేవాలయం పక్కన గల రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు.రేణుక ఎల్లమ్మ బంగారు ముక్కు పుల్ల,ముక్కు పొగు,వెండి ముక్కు పుడక,వెండి చంద్ర వంక, వెండి చేతి కడియం 3 తులాలు మొత్తం అందాజు రూ 21600 విలువగల అభరణాలు చొరికి గురయ్యాయని పిటిషన్‌దారు కట్టమల్లన్న దేవాలయ జూనియర్ అసిస్టెంట్ గంగరాజు శ్యాంసుందర్ రావు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్‌హెచ‌వో జి బాబులాల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



తీన్మార్ మల్లన్నకు మెపా కృతజ్ఞతలు

నవతెలంగాణ-చెన్నారావుపేట

ముదిరాజుల ఐక్యత కోసం కషి చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మెపా వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని క్యూన్యూస్ ఆఫీసులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌ల చరిత్రను, సంస్కృతి సాంప్రదాయాలను మల్లన్న అవగాహన పరచారని, ముదిరాజ్‌ల్లో ఉద్యమ స్ఫూర్తి నింపిన మల్లన్నకు ధన్యవాదాలు తెలుపుతూ, బిసీ మేధావుల సహకారంతో బిసి కుల గణన ఉద్యమాన్ని ఎత్తుకున్న మల్లన్న కు మెపా ఎల్లవేళలా సపోర్టు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు దండు చిరంజీవి, నీరటి రాజు,పెండ్యాల కష్ణ, దుండి అశోక్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-గీసుగొండ

మండలంలోని మచ్చాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సంగినేని భిక్షపతి ఇటీవలకాలంలో అనారోగ్యంతో మతి చెందారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భిక్షపతి కుటుంబాన్ని పరామర్శించి అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జెడ్పీటీసీ పోలిస్ ధర్మారావు, మాజీ సర్పంచ్ జయపాల్‌రెడ్డి, నాగేశ్వరావు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ పదవీ కేటాయింపుపై పునరాలోచన చేయాలి

అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత పానుగంటి విష్ణువర్ధన్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్:

ఆసియా ఖండంలో ప్రఖ్యాతలు పొందిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం నియామకంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత పానుగంటి విష్ణువర్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కేసముద్రం మండల కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నేటి వరకు ఎన్నో పేరు. ప్రఖ్యాతలు. ప్రాధాన్యతను సంతరించుకుని రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు తగిన మద్దతు ధర కేటాయించిన ఘనతను సొంతం చేసుకున్నదన్నారు. ఇన్ని సంవత్సరాలు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం కష్టపడిన పాలకవర్గాలకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని కాని ప్రస్తుత ప్రజాపాలనలో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిత్యం రైతులు. అన్నివర్గాల ప్రజలతో మమేకమైన ప్రజా నాయకుడు అంబటి మహేందర్‌రెడ్డికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రజాప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదివరకే ప్రకటించిన జాబితాలో ఉన్న ఘంట సంజీవరెడ్డి కూడా ప్రజలకు ఎంతో అభిమానం.గౌరవం ఉన్నాయని వారి విలువైన సలహాలు, సూచనలు ప్రజాప్రభుత్వానికి ఎంతో అవసరమని పేర్కొంటూ స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నియామకంపై పునరాలోచన చేసి నియోజకవర్గంలో కష్టపడ్డ పని చేసిన కార్యకర్తను గుర్తించాలని ప్రజ ాప్రభుత్వంలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరదబాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ..



నవతెలంగాణ- మరిపెడ

ఇటీవల కురిసిన భారీ వరదల నేపథ్యంలో మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్). ఫేస్-3 ప్రాజెక్టులో భాగంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారం గ్రామంలో ఆదివారం వరద సహాయక చర్యలు చేపట్టింది. భారీ వరదల వల్ల ఇంటిలోని ప్రతి వస్తువును కోల్పోయిన నిరుపేదలకు ఆహారం, కిరాణా సామాను పంపిణీ చేశారు. టీడీఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో టీడీఎఫ్ వాలంటీర్లు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరద బాధితులకు ఆహారం. నిత్యవసర కిరాణా సరుకులు పంపిణీ చేసి చేయూతనిచ్చారు. తేజావత్ రామ్ చందు-రిటైర్డ్ ఐఏఎస్ (స్పెషల్ రిప్రజెంటేటివ్ ఆఫ్ తెలంగాణ) వారి విజ్ఞప్తి మేరకు కష్టకాలంలోతమకు నిత్యవసరాలు అందించిన టీడీఎఫ్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ వినీల్, ఇందు ప్రియ, వర్షా ప్రియాంక, మేఘన, ప్రియ వేణుగోపాల్, యాదయ్య, బాధితులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు యాకయ్య సేవలు అభినందనీయం

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రి నారాయణ



నవతెలంగాణ-తొర్రూరు

పాఠశాల విద్యకు, పీఆర్‌టీయూ సంఘానికి రాయిపెల్లి యాకయ్య అందించిన సేవలు అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంక బద్రి నారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డిలు అన్నారు. ప్రాథమిక విద్యలో 22 సంవత్సరాలు పనిచేసే ఎంతోమంది చిన్నారులకు సేవలందించి ప్రమోషన్లలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్‌గా మరిపెడ మండలం జడ్పీహెచ్ఎస్ చిల్లంచెర్లకు వెళ్లిన సందర్భంగా స్థానిక లయన్స్ భవనంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2002లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి పీఆర్‌టీయూలో సభ్యత్వం తీసుకొని చురుకుగా పనిచేశారని, ఆయన సేవలను గుర్తించి అదే సంవత్సరంలో అప్పటి రాష్ట్ర బాధ్యులు మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి(ఎస్ఓఎస్)గా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, తొర్రూరు మండల ప్రధాన కార్యదర్శిగా ఆయన సంఘానికి ఎనలేని సేవ చేశారన్నారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో చాలా చురుకుగా పని చేశారని, సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి వివిధ రకాల చైతన్యవంతమైన కార్యక్రమాలు చేశారని, కోవిడ్ సమయంలో కూడా అవసరార్థులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో జినుగ విప్లవరెడ్డి, పులి ముత్తిలింగంగౌడ్, దుబ్బాక శ్రీధర్‌రెడ్డి, చీకటి వెంకన్న, పెరుమాండ్ల రమేష్, గొట్టిముక్కుల శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర పూర్ణచందర్, గుర్రం వెంకన్న, గంగిశెట్టి రమేష్ కుమార్, వెలిదే సురేష్ కుమార్, గొడిశాల రఘు, నర్సింహారెడ్డి, కొండ సంజీవ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

చిన్నారి నిత్యకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆశీర్వాదాలు

నవతెలంగాణ-కేసముద్రం రూరల్:



కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన గడ్డం సుధారాణి-నాగార్జునల కుమార్తె గడ్డం నిత్యనూతన వస్త్రఫల పుష్పాలంకరణ వేడుకలో నిత్యను సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ బృందం ఆశీర్వదించారు. సమ్మిగౌడ్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అందుబాటులో లేకున్నా ఫౌండేషన్ ద్వారా చిన్నారి నిత్యకు నూతన వస్త్రాలు బహుకరించి ఆ దేవుడి ఆశీస్సులు నిండు నూరేళ్లు ఉండాలని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిలువేరు సాయి గౌడ్, గాజుల రవి, కొండేటి కళాధర్, భిక్షపతి, పుట్ట ప్రభాకర్, శీలం మహేష్, చీకటి ప్రశాంత్, ప్రభాకర్, గుణగంటి సతీష్, జినుకల శ్రావంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి ఘన స్వాగతం

నవతెలంగాణ-పరకాల .

భారతీయ జనతా పార్టీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి పరకాల మీదుగా హైదరాబాదుకు వెళుతున్న క్రమంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ కూడలిలో సాయంత్రం భారతీయ జనతా పార్టీ పరకాల శాఖ నాయకులు నిరంజన్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు యార్రం రామన్న, భాస్కరాచారి, సూర్యదేవర సదానందం, ఆకుల రాంబాబు, మిడిదిడ్డి నరేష్, జనార్ధన్, ఆకుల శ్రీధర్, పాలకుర్తి ప్రతాప్, ముత్యాల దేవందర్, దామ సతీష్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక: ఎంపీడీవో

నవతెలంగాణ-పెద్దవంగర:



సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల్లో 1 ఏప్రిల్ 2023 నుండి 31 మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించామని, ఈ తనిఖీలో గుర్తించిన అంశాలను సామాజిక తనిఖీ ప్రజా వేదిక ద్వారా బహిర్గతం చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

గౌడ కులస్తుల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి



శ్రీ కంఠమహేశ్వర గౌడ సంఘం అధ్యక్షుడు నిమ్మల శేఖర్ గౌడ్

నవతెలంగాణ-తొర్రూరు

గౌడ కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని తొర్రూరు శ్రీకంఠమహేశ్వర గౌడ సంఘం అధ్యక్షుడు నిమ్మల శేఖర్ గౌడ్ కోరారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆదివారం శ్రీ కంఠమహేశ్వర గౌడ పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ గౌర అధ్యక్షుడు చీకటి రమేష్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిమ్మల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అర్హులైన కల్లుగీత కార్మికులకు ప్రత్యేక సబ్సిడీ లోన్ల తో పాటు ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియా కల్పించాలన్నారు. గోపా జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులకు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించడంతో పాటు అనారోగ్యానికి గురైన గీత కార్మికులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రమేష్ గౌడ్, నాగపురి అశోక్ గౌడ్, ధీకొండ శ్రీనివాస్, రావుల యాదగిరి గౌడ్, బొమ్మగాని ఓంప్రకాష్, కోశాధికారి జనగాం రామ్మూర్తిగౌడ్, బొలగాని ఉప్పలయ్య, ఐలయ్య, బొమ్మగాని యాకయ్య, నిమ్మల రవి, చీకటి శంకరయ్య, బండి యాకయ్య, నిమ్మల యాకన్న గౌడ్, పెద్ది సతీష్, శంకర్, దోరపల్లి రాజేష్, రామచంద్రయ్య, జలగం రవీందర్‌గౌడ్, జలగం స్వామి, శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణ విద్య కరాటేపై దృష్టి సారించాలి

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కార్తికేయను సన్మానించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్/తొర్రూర్

నవంబర్‌లో గోవాలో జరిగే జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామ వాసి ఆకుతోట కార్తికేయను ఆదివారం డివిజన్ కేంద్రంలో జరిగిన స్టేట్ లెవెల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన ఆకుతోట కార్తికేయను పాలకుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డి అభినందించారు. తాజాగా వరంగల లో తొమ్మిదవ జాతీయస్థాయి షోటో కాన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. నెల్లికుదురు మండలానికి చెందిన ఆకుతోట కార్తికేయ ఈపోటీల్లో ఆరెంజ్ బెల్ట్ కట్ ఆఫ్ విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి కార్తీకేయ, కోచ్ యాకూబ్ పాషాను ఝాన్సీ రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదపడుతుందని, పాఠశాల స్థాయి నుంచే కరాటేపై శిక్షణ అవసరమని తెలిపారు. కరాటేలో కార్తికేయ రాణించడం గర్వకారణమనితెలిపారు.



గోవాలో జరిగే జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

సెప్టెంబర్ 30న చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



పీడీఎస్‌యూ పూర్వ ప్రస్తుత విద్యార్థులు

నవతెలంగాణ-తొర్రూరు

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 వసంతాలు నిండిన సందర్భంగా హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సంబరాల పోస్టర్స్ ను ఆదివారం తొర్రూర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఆవిష్కరించారు. ఉస్మానియా అరుణతార, విప్లవతేజం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పురుడు పోసుకున్న పీడీఎస్‌యూ గత 50 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలోని పూర్వ విద్యార్థుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం సాగించి అనేకమంది అమరులను వారి త్యాగాల వారసత్వాన్ని కలిగి ఉందన్నారు.విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్పొరేట్, కాషాయ విద్యకు నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమాలకు పీడీఎస్‌యూ పోరాటాలు ప్రేరణగా నిలిచాయని వారు అన్నారు. అధిక ధరలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలలో ముఖ్యమైన భూమిక పోషించిందన్నారు. భారత విప్లవ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించడానికి కృషి చేస్తూ విప్లవ విద్యార్థి లోకానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. నేడు దేశంలో మోడీ సర్కార్ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో తీసుకొస్తున్న సంస్కారాలు దేశ లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేయటానికి తయారు చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గాకి విద్యారంగ సమస్యల పరిష్కారానికి తగిన నిధులను కేటాయించే బాధ్యతను విస్మరించి కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యార్థులు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్తు ఉద్యమ కర్తవ్యాలను రూపొందించుకోవడానికి 50 వసంతాల సందర్భంగా జరుగుతున్న ఉత్సాహాలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులు మాజీ విద్యార్థి నాయకులు హాజరవుతారని అక్టోబర్ 1న పీడీఎస్‌యూ ఆలిండియా స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నామని వారు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో పీడీఎస్‌యూ మాజీ నాయకులు పసుపులేటి మధు, పంతం సురేందర్, సంజయ్, సేఫ్యుం యాకయ్య, ఊడుగుల యుగంధర్, పాస్టం సాంబ, రామ్ చరణ్, సందీశ్వర్, నరేందర్, నరేష్, వేణు, ఆసిఫ్, శివ, మనోజ్, వెంకట్, కొత్తపెల్లి రవి, ముందంపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

తొర్రూరు సీఐ జగదీష్

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని క్రీడలపై ఆసక్తి పెంపొదించుకోవాలని తొర్రూరు సీఐ జగదీష్ అన్నారు. తొర్రూరు సర్కిల్ పోలీస్ తొర్రూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులతో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను తొర్రూరు సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో యతి రాజారావు పార్క్(స్టేడియం)లో నిర్వహించారు. ఈసందర్భంగా టికెట్ క్రీడలను ప్రారంభించి టిడబ్ల్యూజే (ఐజేయు) జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డిలతో కలిసి సీఐ జగదీష్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందిస్తాయని, ప్రతి ఒక్కరూ వారి వీధి నిర్వహణతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడ పోటీల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ క్రికెట్ పోటీలో తొర్రూరు సర్కిల్ పోలీస్ టీం విజయం సాధించారు. ఈ క్రీడల్లో సిక్స్ లు కొట్టిన ముగ్గురికి మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ నర్యాటి గజానంద్ రూ.516 చొప్పున నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, పి.రాజు, రమేష్‌బాబు, క్రాంతి కిరణ్, సురేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నాగపురి అశోక్‌గౌడ్, వెంకటరమణ, కృష్ణ ప్రసాద్, నారాయణరాజు, వినోద్‌రెడ్డి, చీకటి వీరన్నగౌడ్, యాదగిరినాయక్, సాంబశివ, రాంబాబు, ఆకుతోట యాకన్న శ్రీకాంత్, సంతోష్, భాస్కర్, సురేష్, అమీర్, మహేష్, ఆంజనేయులు, రాజు, నిమ్మల రవి, మనోహర్‌స్వామి, రాజేందర్ ,శ్రీనివాస్, కార్తీక్, శేఖర్, పోలీసులు పాల్గొన్నారు.



వాగ్దేవిలో స్నాతకోత్సవం

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

హనుమకొండ ప్రముఖ వాగ్దేవి విద్యాసంస్థల వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవం గ్రాడ్యుయేషన్ డే-2024 ప్రిన్సిపల్ డాయిష్ట్రఓఎం చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎస్.సంధ్య, రిజిస్ట్రార్, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, వరంగల్ వారు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉత్తీర్ణులైన ఫార్మసిస్టుల యొక్క బాధ్యత, ఫార్మా ఇండస్ట్రీ క్లినికల్ ఫార్మసీ విభాగాలలో విద్యార్థులు అప్రమత్తంగా బాధ్యతగా ఉంటూ ఎన్నో అవకాశాలు అందుకొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కం కరస్పాండెంట్ డాక్టర్ సి.హెచ్. దేవేందర్‌రెడ్డి అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ వాహినీదేవి , ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీ డాక్టర్ వై.శ్రవణ్ కుమార్, డాక్టర్ ఇ.వెంటేశ్వర్లు, డాక్టర్ బీఎస్ శరవణ భవ, డాక్టర్ డి.కుమారస్వామి, డాక్టర్ పీహెచ్.మహేష్, ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.పావని, డాక్టర్ పి.గిరిజ, డాక్టర్ ఎం.మాధవి, డాక్టర్ లక్ష్మీ కళ్యాణి, టి.రజని, కే.రాగిణి, ఎం.శృతి, సుమలత, భవాని, వి.స్నేహప్రియ, సఫియా నసీర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



జ్వరంతో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-మహబూబాబాద్

గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొడ్డుపల్లి శంకర్(45) మృతి చెందినట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ఎంపీ యూపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా శంకర్ పనిచేస్తున్నాడని తెలిపారు శంకర్ టీపీటీఎఫ్ మండల ఉపాధ్యక్షుడు గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శంకర్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. శంకర్ మృతికి టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, జిల్లా నాయకులు బలాస్టి రమేష్, సోమ విష్ణువర్ధన్, నాయకులు రాచకొండ ఉపేందర్, సజ్జనము విద్యాసాగర్, కోడెం శ్రీనివాస్, మోహన్, బి.రాజు, బి.అంజయ్య, పి.రమేష్, ఈదుల పూసపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పూజారి వీరయ్య, బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ బద్రు, ఉపాధ్యాయులు, కాళోజి వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు శంకర్ మృతికి సంతాపం తెలియజేశారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం..

నవతెలంగాణ-మరిపెడ

ఓ యువకుడు గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం చలంచర్ల గ్రామానికి చెందిన మురారి వెంకన్న చిన్న కుమారుడు మురారి మహేష్ (22) గత కొన్ని రోజుల నుండి హైదరాబాదులో ఉంటు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనేపథ్యంలో ఇటీవల స్వగ్రామైన చిల్లంచర్లకు వచ్చినట్లు తెలిపారు. ఇదేగ్రామానికి చెందిన ఓ యువతీపట్ల మహేష్ దురుసుగా ప్రవర్తించారని యువతీ కుటుంబ సభ్యులు యువకులపై శనివారం దాడి చేశారు. అనంతరం యువకుని కుటుంబ సభ్యులు మళ్ళీ యువతీ కుటుంబంపై దాడికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది చిల్లంచర్ల లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో యువతీ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా యువకుడిని పోలీసులు విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. యువకుని ప్రవర్తనపై పోలీసులు మందలించారు. ఆదివారం నాడు మళ్లీ యువకుడు స్టేషన్ రావాల్సి ఉండగా ఇంటి వద్ద గడ్డి మందు సేవించారు. కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం ఖమ్మంకు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. యువకుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై స్థానిక ఎస్సై సతీష్ గౌడ్ ను వివరణ కోరగా మహేష్ ఓ యువతీని వేధిస్తున్నాడని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించామని తెలిపారు. గతంలో అతనిపై ఫిర్యాదు లు వచ్చిన నేపథ్యంలో ప్రవర్తన మార్చుకోవాలని మందలించినట్లు ఎస్సై సతీష్ గౌడ్ తెలిపారు.

కామ్రేడ్ ముక్తార్ పాషా వర్ధంతి సభ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కొత్తగూడ

సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీ యూ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ముక్తార్ పాషా 4వ వర్ధంతి సందర్భంగా బయ్యారం మండల కేంద్రంలో జరుగు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ముష్మి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో గ్రూప్ మీటింగ్ నిర్వహించి విస్తత ప్రచారంనిర్వహించారు. ఈకార్యక్రమంలో ముస్మి ప్రాంతీయ కమిటీ సభ్యులు పసునూరి రాజమల్లు, పిట్టల దేవేందర్, జాష్ట, రామ్ సింగ్, పూర్ణ చందర్, భూక్య శంకర్, బలబోయిన నరేష్, రాజా, నాగేష్, రామ్ దాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో డివిజన్ స్థాయి క్రీడోత్సవాలు

నవతెలంగాణ-కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన పీఈటి పీడీల సమావేశంలో గౌరవ కమిషనర్ పిఒ, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశానుసారంగా జిల్లాలోని ప్రభుత్వ గిరిజన గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల బాల బాలికల డివిజన్ స్థాయి క్రీడల పోటీలు రెండు డివిజన్లు ఒకటి, మహబూబాబాద్ ఏటీడీఓ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహ విద్యార్థులకు 26, 27న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల రెడ్యాల యందు, కొత్తగూడా పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడ యందు నిర్వహించబడును, సెప్టెంబర్ 27, 28 రోజున క్రీడా ఉత్సవాలు ఎంపిక జరుగును కావున సంబంధిత ప్రధానోపాధ్యాయులు వసతి గృహ వార్డెన్‌లు ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావలసిందిగా డిప్యూటీ డైరెక్టర్ మాలోత్ సైదానాయక్, స్పోర్ట్స్‌ఆఫీసర్ సిహెచ్. కొమ్మాలు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహించే క్రీడలు 14 సంవత్సరములు, 17 సంవత్సరాల బాల బాలికలకు డివిజన్ డివిజనల్ స్థాయి ఎంపిక క్రీడలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, క్యారం, టెలికాయిట్ డివిజన్ స్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. ఈసమావేశంలో డిప్యూటీ డిఇఓ ధరావత్ సారయ్య ఏ టి డి ఓ భాస్కర్, ఏసిఎంఓ ఇరులాల్, ఏవో కృష్ణ అర్జున్ పిడి లు కొత్తగూడ డివిజన్ సెక్రెటరీ రేగా రమేష్, మహబూబాబాద్ డివిజన్ సెక్రెటరీ డి.మోహన్ నాయక్ పిఈటి లు పద్మ బి.సుశీల, పి.అనిల్ పి.అశోక్ బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీళ్లు రావట్లే... అధికారులేమో పట్టించుకోవట్లే ..

ఖాళీ బిందెలతో మహిళల నిరసన..

నవతెలంగాణ-చిన్నగూడూరు

చిన్న గూడూరు మండల కేంద్రంలోని పగుడుపల్లి గ్రామంలో గత 22 రోజులుగా నీళ్ల రావడంలేదని ఆదివారం పగుడుపెల్లి గ్రామంలో మహిళలు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రీఫేస్ విద్యుత్ రాకపోవడం వలన నల్లల బావి నుండి నీళ్లు రావడంలేదన్నారు. గత 22 రోజులుగా నీళ్లు రావడంలేదని మమ్మల్ని పట్టించుకునే నాధుడే లేడా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని తమకు నీళ్లు వచ్చే విధంగా చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బుచ్చమ్మ, వీరమ్మ, పూలమ్మ, సింధుజ, లక్ష్మి, సైదమ్మ తదితరులు ఉన్నారు.

